# హైదరాబాద్ పల్స్
జాతీయ తెలుగు దినపత్రిక

దేశం ముఖ్యం.... దేశ ప్రజల భద్రత ముఖ్యం.... మతం కాదు...



విలేకరులు కావలెను

హైదరాబాద్ పల్స్ జాతీయ తెలుగు దినపత్రిక

"ఎంతకైనా తెగిస్తాం... ప్రజల గొంతుకై నిలుస్తాం" అనే నినాదంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రారంభించిన హైదరాబాడ్ పల్స్ జాతీయ దినపత్రికకు తెలుగు రాష్ట్రాలలోని అన్ని మండల, నియోజకవర్గాల, జిల్లాల వ్యాప్తంగా విలేకరులు కావలెను. * సీనియర్లకు ప్రాధాన్యత కలదు.

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్స్

- Dr. RAHUL KUMAR 9989834020
- K. Naveen Kumar 94406 53413

www.hyderabadpulse.com HyderabadPulse @hyderabad



సీఈఓ : కె నవీన్ కుమార్ | ఎడిటర్: డా. రాహుల్ కుమార్ | సంపుటి: 03 | సంచిక : 111 | పేజీలు : 08 | సోమవారం | 27-04-2026 | వెల :4/-

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD, SANGAREDDY, WARANGAL, MANCHIRYAL, VIJAYWADA, GUNTUR, KURNOOL, TIRUPATI, KADAPA, BENGALURU, MUMBAI, CHENNAI, DELHI.


## ఇక మా టైం మొదలైంది



2

- తెలంగాణ రాష్ట్ర సేన (టీఆర్ఎస్) పేరుతో కవిత కొత్త పార్టీ
- 'మీ టైం అయిపోయింది, మా టైం మొదలైంది' అంటూ సంచలన ట్వీట్
- పార్టీ ఆవిర్భావ సభలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లపై తీవ్ర విమర్శలు
- తండ్రి కేసీఆర్ పార్టీ పాత పేరుతోనే కొత్త రాజకీయ ప్రయాణం

## మండలస్థాయికి 'ప్రజావాణి'

- ప్రతీ అర్జి, ఫిర్యాదు నమోదు చేయాలి
- నిర్ణీత గడువులోగా వాటిని పరిష్కరించాలి
- పరిష్కార పురోగతి అర్జీదారుకు తెలియాలి
- ఫిర్యాదుల నమోదు, ట్రాకింగ్, పరిష్కారానికి ఒకే డిజిటల్ ప్లాట్‌ఫాం
- ఆటో ఎస్కలేషన్, అవసరమైతే అప్పీలు వ్యవస్థ కూడా
- అధికారులకు సీఎం రేవంత్ ఆదేశాలు

2



## ఈసారి ప్లీనరీ లేదు..

### ప్రతీచోట గులాబీ జెండాలు ఎగరాలన్న కేటీఆర్

- బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండాలు ఎగరేయాలని పిలుపు
- సోమవారం తెలంగాణ భవన్‌లో రాష్ట్ర స్థాయి ప్రతినిధుల సమావేశం
- వేసవి తీవ్రత దృష్ట్యా ప్లీనరీకి బదులు కార్యవర్గ సమావేశం
- ఆహ్వానం ఉన్నవారు మాత్రమే రావాలని నేతలకు కేటీఆర్ సూచన
- నియోజకవర్గాల్లోనే వేడుకలు జరపాలని కార్యకర్తలకు విజ్ఞప్తి

2



# సెన్సస్ 2027

- తెలంగాణలో సెన్సస్ 2027 సెల్ఫ్ ఎన్యూమరేషన్ ప్రక్రియ ప్రారంభం
- స్వయంగా వివరాలు నమోదు చేసుకుని కార్యక్రమాన్ని ప్రారంభించిన సీఎం రేవంత్
- కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో మే 10 వరకు ఆన్‌లైన్‌లో నమోదుకు అవకాశం
- తెలంగాణకు తొలి, దేశానికి మొదటి డిజిటల్ జనగణన ఇదే
- ఈసారి జనాభా లెక్కల్లో కులగణన కూడా చేపట్టనున్న అధికారులు

2



**హైదరాబాద్ పల్స్,హైదరాబాద్**

తెలంగాణలో సెన్సస్ 2027 ప్రక్రియ ఆదివారం అధికారికంగా ప్రారంభమైంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా తన వివరాలను అధికారిక వెబ్ పోర్టల్ ద్వారా నమోదు చేసి, సెల్ఫ్ ఎన్యూమరేషన్ (స్వయం నమోదు) ప్రక్రియను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొని, విజయవంతం చేయాలని ఆయన ప్రజలకు

## విందులో కాల్పులు...

### భద్రతా సిబ్బంది తీసుకెళుతుండగా కిందపడిపోయిన ట్రంప్...

- వైట్‌హౌస్ విందులో కాల్పుల కలకలం
- భద్రతా సిబ్బంది తరలిస్తుండగా కిందపడిపోయిన ట్రంప్
- ఉపాధ్యక్షుడు వాన్స్‌ను జాకెట్ పట్టుకుని లాగేసిన సిబ్బంది
- కాల్పులకు పాల్పడిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్న సీక్రెట్ సర్వీస్
- ట్రంప్ సహా అందరూ సురక్షితమని అధికారిక ప్రకటన

2




## ఎమ్మెల్సీలుగా కోదండరాం, అజారుద్దీన్

### గవర్నర్ కోటాలో నియమిస్తూ గెజిట్ నోటిఫికేషన్ విడదల

### నేడు ఎమ్మెల్సీగా కోదండరాం ప్రమాణ స్వీకారం



2

**హైదరాబాద్ పల్స్,హైదరాబాద్**

ప్రభుత్వ సిఫారసుతో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా నామినేట్ చేసిన కోదండరాం, మంత్రి అజారుద్దీన్‌లను శాసనమండలి సభ్యులు (ఎమ్మెల్సీ)గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆదివారం నుంచి ఆరేళ్లపాటు వీరు ఎమ్మెల్సీలుగా కొనసాగనున్నట్లు తెలిపింది. అయితే, గవర్నర్ కోటా ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాలపై సుప్రీంకోర్టులో కేసు విచారణలో ఉంది. తుది తీర్పు

## 'నో స్టాక్' బోర్డులు కనిపించకూడదు

- ఏపీలో పలు చోట్ల ఇంధన కొరత... పెట్రోల్ బంకుల మూసివేత
- ఈ విషయాన్ని సీరియస్ గా తీసుకున్న చంద్రబాబు
- ఆయిల్ కంపెనీల ప్రతినిధులతో టెలికాన్ఫరెన్స్
- కంపెనీల అనుమతులపై పునరాలోచన చేయాల్సి వస్తుందని వార్నింగ్

2



## జనగణనను రాజకీయం చేయొద్దు



2

- రాష్ట్రాభివృద్ధి ప్రణాళికలకు ఇది పునాది..
- 'సంక్షేమం'పై ఎలాంటి ప్రతికూలత ఉండదు
- ప్రజలు కచ్చితమైన సమాచారం ఇవ్వాలి
- స్వీయ జనగణన ప్రారంభంలో కిషన్ రెడ్డి

**హైదరాబాద్ పల్స్,హైదరాబాద్**

జనగణనను రాజకీయం చేయవద్దని కేంద్ర మంత్రి జీ కిషన్ రెడ్డి కాంగ్రెస్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ అంశం పూర్తిగా పరిపాలనకు

## మండుతున్న ఎండలు

2

నిజామాబాద్ జిల్లా మెండోరాలో 44.4 డిగ్రీలు

## పీసీ ఘోష్ నివేదికపై నేడు సీఎం సమీక్ష

2



## 'నో స్టాక్' బోర్డులు

# కనిపించకూడదు

మొదటి పేజీ తరువాయి

సోమవారం నుంచి రాష్ట్రంలో ఎక్కడా పెట్రోల్ బంకుల వద్ద 'నో స్టాక్' బోర్డులు కనిపించడానికి వీల్లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆయిల్ కంపెనీలకు స్పష్టం చేశారు. ఉద్దేశపూర్వకంగా ప్రజలను, ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టాలని చూస్తే కంపెనీల అనుమతులపై పునరాలోచన చేయాల్సి వస్తుందని తీవ్రంగా హెచ్చరించారు. రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ కృత్రిమ కొరతపై ఆదివారం తన క్యాంపు కార్యాలయం నుంచి అధికారులు, ఆయిల్ కంపెనీల ప్రతినిధులతో ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రజల నిత్యావసరాలైన పెట్రోల్, డీజిల్ సరఫరాలో బాధ్యతారహితంగా వ్యవహరిస్తే సహించేది లేదని సీఎం తేల్చి చెప్పారు. రిటైల్ ఔట్‌లెట్లకు క్రెడిట్ నిలిపివేసి, సరఫరా ఆపడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో నయారా, రిలయన్స్ వంటి ప్రైవేట్ ఆపరేటర్లు సరఫరా నిలిపివేయడంతో సమస్య తీవ్రమైందని అధికారులు సీఎంకు వివరించారు. దీనికి తోడు వరికోతలు, అగ్రి, ఆక్వా రంగాల నుంచి డీజిల్‌కు డిమాండ్ పెరగడం కూడా కొరతకు కారణమైంది. మూడు రోజుల క్రితమే సమస్యను గుర్తించినా ఎందుకు తక్షణ చర్యలు తీసుకోలేదని కంపెనీల ప్రతినిధులను సీఎం ప్రశ్నించారు. నివేదికలు కాదు, ఫలితాలు చూపించాలని ఆదేశించారు. ఈ సమస్యను తక్షణం చక్కదిద్దేందుకు ప్రభుత్వం టాస్క్‌ఫోర్స్, కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసిందని తెలిపారు. ఎట్టిపరిస్థితుల్లోనూ బ్లాక్ మార్కెట్ అమ్మకాలు జరగకూడదని, రైతులకు ఇబ్బంది లేకుండా కూపన్ విధానంపై ఆలోచించాలని అధికారులకు సూచించారు. సరఫరాను వెంటనే సాధారణ స్థితికి తీసుకురావాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు తప్పవని చంద్రబాబు మరోసారి హెచ్చరించారు.

# ఇక మా టైం మొదలైంది

మొదటి పేజీ తరువాయి

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుమార్తె, మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత తన కొత్త రాజకీయ ప్రయాణాన్ని అధికారికంగా ప్రారంభించారు. 'తెలంగాణ రాష్ట్ర సేన (టీఆర్ఎస్)' పేరుతో కొత్త పార్టీని ప్రకటించిన ఆమె, ఆ తర్వాత చేసిన తొలి ట్వీట్ రాజకీయ వర్గాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. 'మీ టైం పూర్తయ్యింది.. మా టైం మొదలైంది" అంటూ ఎక్స్‌లో ఆమె పోస్టు పెట్టారు. శనివారం హైదరాబాద్‌లోని మునీరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో కవిత తన పార్టీ పేరును అధికారికంగా ప్రకటించడం తెలిసిందే. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. తెలంగాణ రాజకీయాల్లో తన పార్టీ ఒక కొత్త శక్తిగా ఎదుగుతుందని ధీమా వ్యక్తం చేశారు. గత కొంతకాలంగా రాష్ట్రవ్యాప్తంగా పర్యటనలు చేస్తున్న కవిత, ఎట్టకేలకు సొంత పార్టీతో ప్రజల ముందుకు వచ్చారు. ఈ పరిణామంలో అత్యంత ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, తన తండ్రి కేసీఆర్ స్థాపించిన పార్టీ అసలు పేరు 'తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్)'ని పోలి ఉండేలా 'తెలంగాణ రాష్ట్ర సేన (టీఆర్ఎస్)' అని నామకరణం చేయడం. బీఆర్ఎస్ నుంచి వేరుగా, సొంత రాజకీయ అస్తిత్వం కోసం కవిత ఈ నిర్ణయం తీసుకోవడం తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. ఆమె చేసిన ట్వీట్, ఎవరిని ఉద్దేశించిందనే దానిపై ఊహాగానాలు మొదలయ్యాయి.

# ఎమ్మెల్సీలుగా కోదండరాం, అజారుద్దీన్

మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వానిఅనుకూలంగా వస్తే వీరి సభ్యత్వాలకుఎలాంటి ప్రమాదం ఉండబోదని శాసనమండలి వర్గాలు చెబుతున్నాయి. వాస్తవానికి గవర్నర్ కోటాలోని ఈ రెండు ఎమ్మెల్సీ సీట్లు 2023, మే 27నే ఖాళీ అయ్యాయి. అప్పటి కేసీఆర్ ప్రభుత్వం ఈ సీట్ల కోసం బీఆర్ఎ?సపార్టీ నేతలు దాసోజు శ్రవణ్, కుర్రా సత్యనారాయణ పేర్లను ప్రతిపాదించగా.. అప్పటి గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ తిరస్కరించారు. ప్రభుత్వ ప్రతిపాదనలను గవర్నర్ తిరస్కరించడం రాజ్యాంగ వ్యతిరేకమంటూ దాసోజు శ్రవణ్, కుర్రా సత్యనారాయణలు కోర్టును ఆశ్రయించారు. 2023లో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఈ రెండు సీట్లకు కోదండరాం, అమెర్ అలీఖాన్‌ల పేర్లను ప్రతిపాదించింది. గవర్నర్ ఆమోదంతో కొద్ది నెలల పాటు వారు ఎమ్మెల్సీలుగా కొనసాగారు. అయితే, ఎమ్మెల్సీలుగా వీరి నియామకం చెల్లదని సుప్రీంకోర్టు తీర్పునిచ్చి.. తాజా ప్రతిపాదనలు పంపాలని సూచించింది. ఆ సూచన మేరకు కోదండరాం పేరును కొనసాగిస్తూ.. అమెర్ అలీఖాన్ స్థానంలో అజారుద్దీన్ పేరును అప్పటి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు ప్రభుత్వం పంపింది. కేసు ఇంకా విచారణలో ఉండటంతో గవర్నర్ ఆ ప్రతిపాదనను పెండింగ్‌లో పెట్టారు. తాజాగా కోర్టు చేసిన సూచన మేరకు ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి కొత్త గవర్నర్ శివప్రసాద్ శుక్లాను కలిసి వీరిని ఎమ్మెల్సీలుగా నామినేట్ చేయాలని కోరారు. న్యాయ నిపుణుల సలహాలు తీసుకున్న గవర్నర్.. కోదండరాం, అజారుద్దీన్‌లను శనివారం నామినేట్ చేశారు. దాని ఆధారంగా ఆదివారం ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. కోదండరాం నేడు ఎమ్మెల్సీగా ప్రమాణం చేయనున్నారు. కాగా, ప్రభుత్వ నిర్ణయం మంత్రి అజారుద్దీన్‌కు పెద్ద ఊరటనే ఇచ్చింది. ఆయన మంత్రిగా బాధ్యతలు తీసుకుని ఈ నెల 30 నాటికి ఆరు నెలలు పూర్తవుతుంది. ఆలోపు చట్టసభల్లో ఆయన సభ్యుడు కాకపోతే నిబంధనల ప్రకారం మంత్రి పదవిని కోల్పోవాల్సి వస్తుంది. తాజాగా ప్రభుత్వం గెజిట్ జారీచేయటంతో పదవీ గండం తప్పించుకున్నారు.

# ఈసారి ప్లీనరీ లేదు..

మొదటి పేజీ తరువాయి

భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం రాష్ట్రవ్యాప్తంగా పార్టీ జెండాలు ఎగరేయాలని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆదివారం నాడు పార్టీ నేతలతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఆయన ఈ విషయం తెలిపారు. గ్రామాలు, పట్టణాలు, నియోజకవర్గ కేంద్రాల్లో జెండా వందనం చేసి వేడుకలు జరపాలని అన్నారు. ఈ సందర్భంగా సోమవారం తెలంగాణ భవన్‌లో రాష్ట్ర స్థాయి ప్రతినిధుల సమావేశం నిర్వహించనున్నట్లు కేటీఆర్ ప్రకటించారు. వాస్తవానికి ప్లీనరీ నిర్వహించాల్సి ఉన్నప్పటికీ, ఇటీవల జగిత్యాలలో భారీ సభ నిర్వహించడం, ప్రస్తుతం ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఈసారికి కార్యవర్గ సమావేశానికే పరిమితం చేస్తున్నట్లు వివరించారు. పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా అధ్యక్షులు, మాజీ ప్రజాప్రతినిధులకు మాత్రమే ఆహ్వానాలు పంపినట్లు పార్టీ స్పష్టం చేసింది. ఆహ్వానం ఉన్నవారు మాత్రమే తెలంగాణ భవన్‌కు రావాలని, మిగతా నాయకులు తమ తమ నియోజకవర్గాల్లోనే ఉండి వేడుకలు ఘనంగా నిర్వహించాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ఉద్యమం కోసం 2001లో కేసీఆర్ టీఆర్ఎస్‌ను స్థాపించగా, 2014లో ప్రత్యేక రాష్ట్రం ఏర్పడింది. దేశవ్యాప్తంగా విస్తరించే ప్రణాళికతో 2022లో పార్టీ పేరును బీఆర్ఎస్‌గా మార్చారు. అయితే, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ చేతిలో అధికారం కోల్పోయిన బీఆర్ఎస్, 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఒక్క స్థానంలోనూ గెలవలేకపోయింది.

# సెన్సస్ 2027

మొదటి పేజీ తరువాయి

పిలుపునిచ్చారు. కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో ఈ ప్రక్రియ మొదలైంది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ), సైబరాబాద్, మల్కాజ్‌గిరి కార్పొరేషన్లను కలిపి ఒకే యూనిట్‌గా ఈ జనగణన చేపడుతున్నారు. మే 10 వరకు ప్రజలు స్వచ్ఛందంగా ఆన్‌లైన్‌లో తమ వివరాలను నమోదు చేసుకోవచ్చు. ఈ 15 రోజుల పాటు సెల్ఫ్ ఎన్యూమరేషన్ ప్రక్రియ కొనసాగుతుంది. పౌరులు ంవ.ఎవఅంబం.న్రశీజ.ఱఅ వెబ్‌సైట్‌లోకి లాగిన్ అయి, తమ వివరాలను సమర్పించవచ్చు. ఉదయం 6 గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు పోర్టల్ అందుబాటులో ఉంటుంది. ఇందులో గృహ, వసతులు, ఆస్తులకు సంబంధించిన 33 ప్రశ్నలు ఉంటాయి. ఎలాంటి పత్రాలు అవసరం లేదని, 15-20 నిమిషాల్లో ప్రక్రియ పూర్తవుతుందని అధికారులు తెలిపారు. వివరాలు సమర్పించాక వచ్చే సెల్ఫ్ ఎన్యూమరేషన్ ఐడీ (ఎస్ఈ ఐడీ)ని, వెరిఫికేషన్ కోసం వచ్చే సిబ్బందికి చూపించాల్సి ఉంటుంది. ఇది భారతదేశంలోనే మొట్టమొదటి పూర్తిస్థాయి డిజిటల్ జనగణన కావడం విశేషం. అలాగే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత జరుగుతున్న తొలి సెన్సస్ కూడా ఇదే. ఈసారి కులగణన కూడా చేపట్టనున్నారు. మే 11 నుంచి జూన్ 9 వరకు ఇంటింటికి తిరిగి వివరాలు సేకరించే ప్రక్రియ ఉంటుంది. ఈ కార్యక్రమంలో సెన్సస్ ఆపరేషన్స్ డైరెక్టర్ భారతి హోళికేరి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# జనగణనను రాజకీయం చేయొద్దు

మొదటి పేజీ తరువాయి

సంబంధించినదన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మొదటిసారిగా బీసీ జనాభా గణన కూడా ఇందులో భాగమవుతోందని, ఈ ఘనత ప్రధాని మోదీకే దక్కుతుందని కొనియాడారు. ఆదివారం దిల్‌కుషా గెస్ట్ హౌస్‌లో స్వీయ జనగణనను కిషన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా, తర్వాత మీడియాతో చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడారు. ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (సర్)తో బెంగాల్, తమిళనాడు రాష్ట్రాల్లో పోలింగ్ శాతం పెరిగిందన్నారు. హైదరాబాద్‌లో ఎప్పుడూ పోలింగ్ 50 శాతం మించడం లేదని, 'సర్'తో పెరిగే అవకాశం ఉంటుందన్నారు. జనగణన మన కోసం, మన అభివృద్ధి కోసమని, ఇందులో ప్రతి వ్యక్తి భాగస్వామ్యం కావాలని, కచ్చితమైన సమాచారం ఇవ్వాలని కోరారు. అప్పుడే అభివృద్ధి పథకాలు, సంక్షేమంపై స్పష్టమైన ప్రణాళికలు రూపొందించే అవకాశం లభిస్తుందన్నారు. 'మాకు ఇల్లు ఉందని చెబితే పథకాలు రాకపోవచ్చేమో, మా ఇంట్లో ఏసీ ఉందని చెబితే ప్రయోజనాలు తగ్గిపోవచ్చేమో అనే భయాలు ఎవరూ పెట్టుకోవాల్సిన అవసరం లేద'న్నారు. ఇందులో ఇచ్చే సమాచారం ఆధారంగా సంక్షేమ పథకాలపై ఎలాంటి ప్రతికూల ప్రభావం ఉండదని, ఇది పూర్తిగా విధానాల రూపకల్పన కోసమే ఉపయోగపడుతుందన్నారు. ఇల్లు ఉందా లేదా, రిజర్వేషన్ అర్హత వంటి అంశాలు ఇందులో పరిగణనలోకి రావని, కాబట్టి అందరూ ధైర్యంగా వివరాలు ఇవ్వాలన్నారు. జనగణన కార్యకలాపాల సం చాలకులు భారతి హోళికేరి మాట్లాడుతూ.. ప్రజలు పోర్టల్‌లో తమ సమాచారం పొందుపర్చాలని కోరారు.



# విందులో కాల్పులు...

మొదటి పేజీ తరువాయి

వాషింగ్టన్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో కాల్పులు కలకలం రేపడంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను భద్రతా సిబ్బంది హుటాహుటిన తరలించారు. ఈ క్రమంలో ఆయన అదుపుతప్పి కిందపడిపోయారు. ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్‌ను సైతం భద్రతా సిబ్బంది జాకెట్ పట్టుకుని లాక్కెళ్లారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

అమెరికా కాలమానం ప్రకారం, శనివారం రాత్రి వైట్‌హౌస్ ప్రెస్ కరస్పాండెంట్ల అసోసియేషన్ వార్షిక విందు సందర్భంగా ఈ ఘటన చోటుచేసుకుంది. అధ్యక్షుడు ట్రంప్, ప్రథమ మహిళ మెలానియా, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ సహా పలువురు ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ట్రంప్ ప్రసంగం కోసం అందరూ ఎదురుచూస్తున్న వేళ, కోల్ అలెన్ అనే వ్యక్తి కాల్పులు జరిపాడు. అతని వద్ద షాట్‌గన్, హ్యాండ్‌గన్ ఉన్నట్లు అధికారులు గుర్తించారు. కాల్పుల శబ్దాలు వినిపించగానే సీక్రెట్ సర్వీస్ అధికారులు వెంటనే రంగంలోకి దిగి ట్రంప్, వాన్స్‌లను సురక్షిత ప్రాంతానికి తరలించే ప్రయత్నం చేశారు. ఈ తొక్కిసలాటలోనే ట్రంప్ కిందపడిపోయినట్లు వీడియోలో స్పష్టంగా కనిపిస్తోంది. నిందితుడిని సీక్రెట్ సర్వీస్ అధికారులు అరెస్టు చేశారు. ఈ ఘటనపై స్పందించిన ట్రంప్, తామంతా సురక్షితంగా ఉన్నామని తెలిపారు. ఒక భద్రతా అధికారికి గాయాలయ్యాయని, బుల్లెట్‌ప్రూఫ్ వెస్ట్ కారణంగా ప్రాణాలతో బయటపడ్డారని చెప్పారు. కాల్పులకు పాల్పడిన వ్యక్తిని "సిక్ పర్సన్" అని ఆయన అభివర్ణించారు. ప్రస్తుతం ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది.

# మండలస్థాయికి 'ప్రజావాణి'

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్: ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలకు మరింత చేరువ చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇప్పటికే రాష్ట్ర, జిల్లా స్థాయిలో విజయవంతంగా కొనసాగుతున్న 'ప్రజావాణి'ని గ్రామీణ ప్రజలకు మరింత చేరువ చేయాలని, కార్యక్రమాన్ని మరింత పకడ్బందీగా అమలు చేయాలని స్పష్టం చేశారు. ఇందుకోసం ప్రజావాణి సేవలను మండల స్థాయికి విస్తరించాలని ఆదేశించారు. రాష్ట్ర స్థాయిలో హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో జిల్లా స్థాయిలో కలెక్టర్ల ఆధ్వర్యంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ప్రజా వాణిలో అన్ని విభాగాలకు చెందిన అధికారులు ప్రజల నుంచి అర్జీలు, దరఖాస్తులను స్వీకరించి వాటిని వేగంగా పరిష్కంచేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. అయితే, మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో (ఎంసీహెచ్ఆర్డీ) ఆదివారం నిర్వహించిన సమావేశంలో ప్రజావాణికి సంబంధించి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎంవో అధికారులకు ముఖ్యమంత్రి కీలక ఆదేశాలు చేశారు. దూర ప్రాంతాల నుంచి ప్రజలు హైదరాబాద్‌కు లేదా జిల్లా కేంద్రానికి వచ్చే బదులు ప్రజావాణి సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా అన్నారు. అందులో భాగంగానే వెంటనే రెవెన్యూ డివిజన్ స్థాయిలో ప్రజావాణి ప్రారంభించాలని, తర్వాత దశలో మండల స్థాయికి ప్రజావాణిని విస్తరించాలని సూచించారు. ప్రజా వాణిలో వచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి అన్ని స్థాయిల్లో అధికారులకు పూర్తి అధికారాలు ఇవ్వాలని ఆదేశించారు. ప్రజలిచ్చే ప్రతీ ఫిర్యాదును నమోదు చేయాలని, సంబంధిత విభాగాలకు పంపించాలని, పరిష్కార పురోగతిని అర్జీదారునికి తెలియజేయాలని స్పష్టం చేశారు. ఫిర్యాదుల పరిష్కారానికి నిర్ణీత గడువులు ఉండాలని చెప్పారు. ఫిర్యాదుల నమోదు, ట్రాకింగ్, పరిష్కారానికి ఏకీకృత డిజిటల్ ప్లాట్‌ఫాం అభివృద్ధి చేయాలని ఆదేశించారు. జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో రియల్ టైమ్ మానిటరింగ్ ఉండాలని సూచించారు. ప్రతీ స్థాయిలో ప్రజావాణికి ప్రత్యేకంగా నోడల్ అధికారులను నియమించాలని ఆదేశించారు. ప్రతి జిల్లాలోనూ, ప్రతి శాఖలో ప్రత్యేక ప్రజావాణి విభాగాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. ఒక స్థాయిలో పరిష్కారం కాకపోతే, పైస్థాయి అధికారికి అర్జీ అందేలా ఆటో ఎస్కలేషన్ వ్యవస్థను అమలు చేయాలని, అవసరమైతే అప్పీలు వ్యవస్థను కూడా ప్రవేశపెట్టాలని సూచించారు.

# మండుతున్న ఎండలు

మొదటి పేజీ తరువాయి

రాష్ట్రంలో ఎండలు మండుతున్నాయి. ఎండ తీవ్రతతో ప్రజలు బయటకు వచ్చేందుకు భయపడుతున్నారు. ఉదయం 11 గంటలకే ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఆదివారం పలుచోట్ల ఉష్ణోగ్రత 44 డిగ్రీలు దాటింది. నిజామాబాద్ జిల్లా మెండోరాలో రాష్ట్రంలోనే అత్యధికంగా 44.4 డిగ్రీలు నమోదైంది. కోనసముందర్, పోతంగల్, మోర్తాడ్‌లో 44.3, పెర్కిట్, వేల్పూర్, గూపన్‌పల్లి, మల్కాపూర్, తూంపల్లి, మోస్రాలో 44.2 డిగ్రీలు రికార్డయింది. జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం రాఘవపేటలో 44.3, మల్లాపూర్ మండల కేంద్రం, ధర్మపురి మండలం జైనాలో 44.1, మంచిర్యాల జిల్లా కన్నెపల్లి మండలం జన్కాపూర్‌లో 44.2, హాజీపూర్ మండలం ర్యాలీ, నస్పూర్, పాత మంచిర్యాల, జైపూర్ మండలం కుందారంతో పాటు కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలో పలుచోట్ల కూడా 44 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మిగతా జిల్లాల్లో 43 డిగ్రీలు దాటింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం జగ్గారం గ్రామానికి చెందిన మాదినేని ఆరోగ్యబాబు (57), నల్లగొండ జిల్లా పావురాలగూడెం గ్రామానికి చెందిన నిమ్మల యాదయ్య (56) అనే వ్యవసాయ కూలీ వడదెబ్బతో మృతిచెందారు.

## పీసీ ఘోష్ నివేదికపై

# నేడు సీఎం సమీక్ష

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్ : కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ అవకతవకలపై జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికపై సీఎం రేవంత్ రెడ్డి నీటిపారుదల శాఖ అధికారులతో సోమవారం సాయంత్రం సమీక్ష నిర్వహించనున్నారు. పీసీ ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుతో పాటు పలువురు ఐఏఎస్ అధికారులపై చర్యలు వద్దంటూ హైకోర్టు తీర్పునిచ్చిన నేపథ్యంలో తదుపరి కార్యాచరణను ఖరారు చేసే అంశంపై ఈ భేటీలో చర్చించనున్నారు. ఇందులో అడ్వొకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డితో పాటు ఇతర న్యాయనిపుణులు సైతం పాల్గొననున్నారు. అలాగే గోదావరి నదిపై తుమ్మిడిహెట్టి వద్ద బరాజ్ నిర్మించి ఎల్లంపల్లి ప్రాజెక్టుకు గ్రావిటీ ద్వారా నీటి సరఫరాతో పాటు మేడిగడ్డ బరాజ్ పునరుద్ధరణలో పురోగతిపై సైతం ఈ సమావేశంలో సమీక్షించనున్నారు.



# ఉపాధి హామీ పథకం మార్పులపై గ్రామీణ స్థాయిలో నిరసన జ్వాలలు

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 26, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి:**
ఉపాధి హామీ పథకంపై జరుగుతున్న మార్పుల నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో ఆందోళనలు మరింత ఉధృతమవుతున్నాయి. శనివారం మహబూబాబాద్ జిల్లా చిన్న గూడూరు మండల పరిధిలోని పలు గ్రామాల్లో ప్రజల్లో అవగాహన పెంచేందుకు, పథకాన్ని రక్షించాలనే ఉద్దేశంతో విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ నాయకులు మున్నా జానీ అధ్వర్యంలో జయ్యారం, చిన్న గూడూరు, ఉగ్గాంపల్లి, విస్సాంపల్లి, తుమల చెరువు తండా, తదితర గ్రామాల్లో పర్యటిస్తూ గ్రామ సభలు ఏర్పాటు చేసి, ఉపాధి హామీ కూలీలతో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా కూలీల నుంచి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా మున్నా జానీ మాట్లాడుతూ, గ్రామీణ పేదల జీవనానికి ఉపాధి హామీ పథకం ఎంతో కీలకమని తెలిపారు. ఈ పథకంలో మార్పులు తీసుకురావడం వల్ల కూలీలకు నష్టమవుతుందని, దీని ప్రభావం గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై పడుతుందని పేర్కొన్నారు. అలాగే పథకానికి కేటాయించే నిధులు తగ్గడం వల్ల పనుల అవకాశాలు తగ్గుతున్నాయని, దీని వల్ల కూలీల జీవనం కష్టతరమవుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పేదల సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని, గ్రామీణ ప్రజల సమస్యలను ప్రభుత్వం గుర్తించాలని కోరారు. గ్రామ స్థాయిలో ఈ ఉద్యమాన్ని మరింత విస్తరించనున్నట్లు, గ్రామ సభ తీర్మానాలు మరియు సంతకాల సేకరణ ద్వారా తమ అభిప్రాయాలను తెలియజేస్తామని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామ ప్రతినిధులు, సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




# 100 గిరిజన ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు

## ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే డా. సంజీవరెడ్డి






**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 26, నారాయణఖేడ్ :**
చిట్టచివరి గిరిజన బిడ్డకు కూడా నాణ్యమైన వైద్యం అందాలన్న లక్ష్యంతో,సహారా హెల్త్ డెవలప్మెంట్ సొసైటీ (సీస్సార్) ఆధ్వర్యంలో చేపట్టిన "100 గిరిజన ప్రాంత వైద్య శిబిరాల" భారీ కార్యక్రమాన్ని కంగ్టి మండల పరిధిలోని రాజారాం తండాలో ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి, నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమ హారతి ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.."వైద్యం అనేది కేవలం నగరాలకే పరిమితం కాకూడదు. మారుమూల తండాల్లో నివసించే గిరిజనులకు 'లాస్ట్ మైల్ రీచ్' (లాస్ట్ మైల్ రీచ్) ద్వారా ఇంటి వద్దకే వైద్య సేవలు అందించడం అభినందనీయం. సహారా హెల్త్ డెవలప్మెంట్ సొసైటీ వారు తమ సీస్సార్ నిధులతో ఈ బాధ్యతను తీసుకోవడం గొప్ప విషయం. ఒక డాక్టర్‌గా నాకు తెలుసు, సరైన సమయంలో వైద్యం అందితే ఎన్నో ప్రాణాలను కాపాడవచ్చు. ఈ 100 శిబిరాల ద్వారా నిరంతర ఆరోగ్య పర్యవేక్షణ (సూస్థాయినబ్లె హెల్త్ కేర్) జరుగుతుందని ఆశిస్తున్నాను. "గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలతో పాటు ఆరోగ్యంపై అవగాహన కల్పించడం చాలా ముఖ్యం. ప్రభుత్వం అందిస్తున్న సేవలకు తోడుగా, ఇలాంటి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం వల్ల గ్రామీణ ఆరోగ్య వ్యవస్థ మరింత బలోపేతం అవుతుంది. ప్రతి ఒక్కరూ ఈ ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి," అని సూచించారు. ఈ ప్రాజెక్టు కింద మొత్తం 100 గిరిజన ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించనున్నారు. కేవలం మందులు ఇవ్వడమే కాకుండా, దీర్ఘకాలిక రోగాల గుర్తింపు, గర్భిణీ స్త్రీలు మరియు చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు. సుస్థిర ఆరోగ్య వ్యవస్థ (సూస్తాయినబ్లె హెల్త్ కేర్ సిస్టం) ఏర్పాటులో భాగంగా ఈ శిబిరాలు కొనసాగుతాయి. ఈ కార్యక్రమంలో సహారా హెల్త్ డెవలప్మెంట్ సొసైటీ ప్రతినిధులు, మండల అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు మరియు రాజారాం తండా గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మక్కల రైతులకు న్యాయం ఎప్పుడు..?

## కొనుగోలు కేంద్రాల కోసం ఎదురుచూపులు




**హైదరాబాద్ పల్స్, ఏప్రిల్ 26, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి:**
మహబూబాబాద్ జిల్లా కురవి, సీరోలు మండలాల్లో మొక్కజొన్న (మక్కల) రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల లేమితో ఇబ్బందులు పడుతున్నారని సీపీఐ కురవి పట్టణ కార్యదర్శి తురుక రమేష్ తెలిపారు. ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, ఈ ఏడాది మొక్కజొన్న పంట సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగినప్పటికీ రైతులకు సరైన సౌకర్యాలు అందడం లేదన్నారు. కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో రైతులు తమ పంటను అమ్ముకునేందుకు దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని, ఈ పరిస్థితిని దళారులు ఉపయోగించుకుని తక్కువ ధరలకు పంటను కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. దీంతో రైతులు తీవ్ర ఆర్థిక నష్టాలను చవిచూస్తున్నారని చెప్పారు. మార్కెట్ యార్డులు దూరంగా ఉండటంతో రవాణా ఖర్చులు పెరిగి రైతులపై అదనపు భారం పడుతోందని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర రైతులకు అందాలంటే మండల కేంద్రాల్లోనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం అత్యవసరమని ఆయన స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి కురవి, సీరోలు మండలాల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి రైతులను దళారుల బారి నుంచి రక్షించాలని తురుక రమేష్ విజ్ఞప్తి చేశారు.

# చేనేతల హక్కుల సాధనకు ఐక్య పోరాటం

## చౌటుప్పల్ చేనేత హక్కుల సాధన సభలో అఖిలపక్ష పార్టీలు, ఉద్యమ వేదికల తీర్మానం

హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 26, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : చౌటుప్పల్ లో జరిగిన చేనేత హక్కుల సాధన సభలో అఖిలపక్ష నేతలు హాజరై చేనేత హక్కుల సాధనకు ఐక్య పోరాటలు చేయాలని అన్నారు. బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం, చేనేత సహకార సంఘాలు, చేనేత ఉద్యమ వేదికల ఆధ్వర్యంలో చేనేత దినోత్సవ వ్యవస్థాపకుడు యర్రమాద వెంకన్న నేత అధ్యక్షతన జరిగిన ఈ సభకు ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ఉన్న చేనేత కళాకారులు మరియు కుల సంఘాల నాయకులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రతినిధిగా మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఇరావత్రి అనిల్ కుమార్ హాజరై చేనేత హక్కుల సాధనకు ప్రభుత్వం తో మాట్లాడి చేనేత కార్మికుల సంక్షేమం మరియు అభివృద్ధి కోసం పాటుపడతానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్సీ ఎల్. రమణ మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన చేనేత పథకాలను ప్రస్తుత ప్రభుత్వం నిర్విరావంగా కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. చేనేత కళాకారులకి ఎల్లవేళలా తాను అందుబాటులో ఉంటానని తెలియజేస్తూ, త్వరలోనే చేనేత మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తో మాట్లాడి చేనేత ప్రతినిధులతో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేయిస్తానని అన్నారు. ప్రభుత్వ అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ చేనేతలకు రావలసిన ప్రయోజనాల కోసం నిరంతర కృషి చేస్తానని హామీ ఇచ్చారు. బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ ఆఫీసర్ టీ. చిరంజీవులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడా బాబులకు అనేక రాయితీలు ఇస్తూ చేనేతలను విస్మరిస్తున్నారని పలు గణాంకాలతో సహా వివరించారు. చేనేతల హక్కుల సాధనకు ఐక్య పోరాటాలే శరణ్యమని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉమ్మడి వేదికల ద్వారా సభలు నిర్వహిస్తామని తెలిపారు. చేనేతలు కేవలం ప్రభుత్వ పథకాల కొరకేకాక రాజకీయాలలో మన వాటా, ప్రభుత్వంలో మన అస్తిత్వం కోసం పోరాటాలు చేయాలని సూచించారు. మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు మాట్లాడుతూ చేనేత ఉద్యమాలతో తనకు ఉన్న సుదీర్ఘ ప్రయాణాన్ని వివరిస్తూ ప్రతి రాజకీయ పార్టీ ఎన్నికల ముందు చేనేతలకు అనేక వాగ్దానాలు చేసి గద్దెనెక్కిన తర్వాత వాటిని విస్మరించడం పరిపాటయిందని విమర్శించాడు. చేనేత ఉద్యమాలపై ప్రభుత్వం బెదిరింపు ధోరణి తగదని, న్యాయమైన డిమాండ్ల అమలుకు ప్రభుత్వం చొరవ చూపాలని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు మాట్లాడుతూ చట్టసభల్లో పద్మశాలీ ప్రతినిధులు ఉన్నప్పుడు ప్రభుత్వంతో సమన్వయం చేసే అవకాశం ఉంటుందని, పద్మశాలీలు ఆ దిశగా ఆలోచించి పార్టీలతో సంబంధం లేకుండా ప్రతి ఎన్నికలలో పద్మశాలీలను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పోచంపల్లి మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేష్, మాజీ ఆప్కో డైరెక్టర్ కర్నాటి వెంకటేశం, చౌటుప్పల్ మున్సిపల్ వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్, చేనేత ఐక్యవేదిక అధ్యక్షులు రాపోలు వీరమోహన్, ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ తెలంగాణ అధ్యక్షులు డాక్టర్ బాసబత్తిని రాజేశం, చేనేత కార్మిక సంఘం నాయకులు గంజి మురళి, పాశికంటి లక్ష్మీనరసయ్య, జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం, బిసిఐఎఫ్ నాయకులు కర్నాటి మనోహర్, పెద్ది జగదీష్, చెన్నా శ్రీకాంత్, భారతీయ జనతా పార్టీ చేనేత సెల్ కో కన్వీనర్ బొమ్మ రఘురాం నేత, మాజీ ఎంపీపీ చిక్క నరసింహ, అఖిల భారత పద్మశాలి సంఘం మీడియా విభాగం అధ్యక్షులు అవ్వారు భాస్కర్ చేనేత వర్గాల చైతన్య వేదిక జాతీయ అధ్యక్షులు చిక్కా దేవదాస్ నాయకులు డాక్టర్ కర్నాటి శ్రీనివాస్, సిరందాసు ధనంజయ, గుర్రం నరసింహ, భువనగిరి శ్రీనివాస్ నేత, రాపోలు జగన్, చేనేత సహకార సంఘాల అధ్యక్షులు కందగట్ల బిక్షపతి, ఉప్పలయ్య, గడ్డం జయశంకర్, సామల భాస్కర్ పద్మశాలి నాయకులు చిక్క శ్రీనివాస్, పొట్టబత్తిని జ్ఞానేశ్వర్, పులగం రాములు, జెల్ల నరేందర్ నేత, ఆర్య రాజశేఖర్ నేత, చెరుకు స్వామి, నామాల శ్రీనివాస్ నేత, చిక్క కృష్ణ, ఎల్లంకి సర్పంచ్ ఇడం రాదా శ్రీనివాస్, స్థానిక కౌన్సిలర్ మధుసూదన్, గుర్రం రవీందర్, గోషిక రవి తదితరులు పాల్గొన్నారు.




## లబ్ధిదారులకు ఆర్థిక భరోసాగా...

# కళ్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ



**హైదరాబాద్ పల్స్, ఏప్రిల్ 26, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి:**
డోర్నకల్ మండలం ములకలపల్లి గ్రామంలో ఆదివారం కళ్యాణలక్ష్మీ పథకం కింద లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమం గ్రామ సర్పంచ్ డి.ఎస్. కళావతి జగదీష్ ఆధ్వర్యంలో జరిగింది బాణోతు అమ్ములు (తండ్రి: లాల్ బి) లింగ్యకు కళ్యాణలక్ష్మీ పథకం ద్వారా ప్రభుత్వం అందించిన ఆర్థిక సహాయం చెక్కును అందజేశారు. ఈ పథకం ద్వారా ఆర్థికంగా బలహీన వర్గాలకు చెందిన కుటుంబాలకు పెళ్లిళ్ల సందర్భంలో ప్రభుత్వం అందిస్తున్న సహాయం ఎంతో ఉపయోగకరమని సర్పంచ్ డీఎస్ కళావతి జగదీష్,తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా గ్రామ స్థాయిలో చర్యలు తీసుకుంటున్నామని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ రావుల మౌనిక రామకృష్ణ మాట్లాడుతూ, గ్రామాభివృద్ధి కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. గ్రామంలో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు చేరవేయడంలో ప్రజాప్రతినిధులు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, మాజీ సర్పంచ్ బిక్న నాయక్, అచ్చమ్మ, గ్రామ పెద్దలు బొజ్జ పాండ్రయ్య, వెన్న బోయిన శేషయ్య, జిక్కుల రాంబాబు, భూక్యా నుధర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# పేద కుటుంబ వివాహానికి అండగా నిలిచిన జీ.ఎమ్.ఆర్ ఫౌండేషన్




**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 26, నారాయణఖేడ్ :**
నారాయణఖేడ్ పట్టణంలోని 7వ వార్డులో నివసిస్తున్న నిరుపేద కుటుంబానికి చెందిన ముంతాజ్ కుమార్తె వివాహానికి జీ.ఎమ్.ఆర్ ఫౌండేషన్ ముందుకు వచ్చి సహాయాన్ని అందించింది. జీ.ఎమ్.ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బి ఆర్ యస్ పార్టీ నాయకులు గుఱ్ఱపు మచ్చేందర్ ఆదేశాల మేరకు ఈ సహాయం అందించబడింది. ఈ సందర్భంగా, పేద కుటుంబానికి అండగా నిలుస్తూ వారి ఆనందంలో భాగస్వామ్యం కావడం జీ.ఎమ్.ఆర్ ఫౌండేషన్ సేవా భావాన్ని ప్రతిబింబించింది. ఈ కార్యక్రమంలో నారాయణఖేడ్ మున్సిపల్ 4వ వార్డు బి ఆర్ యస్ పార్టీ అధ్యక్షులు శ్రీకాంత్, నాయకులు తుకారాం, సురేష్, అబ్దుల్ రహ్మాన్ తదితరులు పాల్గొన్నారు. నిరుపేదలకు అండగా నిలుస్తూ సేవలందిస్తున్న జీఎంర్ ఫౌండేషన్‌కు స్థానిక ప్రజలు అభినందనలు తెలియజేశారు.

# పటాన్‌చెరులో చలివేంద్రం: తీవ్ర వేసవిలో ప్రజల దాహం తీర్చే సేవ





**పటాన్‌చెరు, హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 26 :**
పటాన్‌చెరు పట్టణంలోని బ్లాక్ ఆఫీస్ ప్రాంగణంలో శ్రీ లక్ష్మీ డాక్యుమెంట్ రైటర్స్ షాప్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, ఎండీర్ ఫౌండేషన్ కో-ఫౌండర్ మాద్రి పృథ్వీరాజ్ పాల్గొన్నారు. 'ప్రజల ఆరోగ్యం కోసం మంచి సేవ'. పృథ్వీరాజ్ మాట్లాడుతూ, "తీవ్ర వేసవికాలంలో ప్రజలకు చల్లని తాగునీరు అందించడం గొప్ప సేవా కార్యక్రమం. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని చలివేంద్రం ఏర్పాటు చేసిన సాయి రాం గుప్తను అభినందిస్తున్నాను. భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలు కొనసాగాలి" అని అన్నారు. ప్రయాణికులు, స్థానికులు, కార్మికుల దాహార్తిని తీర్చే లక్ష్యంతో ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారని నిర్వాహకులు తెలిపారు. పలువురు నాయకుల పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సత్తి రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, కిట్టు, శివ రెడ్డి, పాషా, ప్రవీణ్, చోటు, మధు, సాయి మరియు ఎండి ఆర్ యువసేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్యుల సంక్షేమానికి సహకారం

### అమీన్పూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్



**అమీన్పూర్, హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 26:** ఆర్యవైశ్యుల సంక్షేమానికి ఎల్లప్పుడు సంపూర్ణ సహకారం అందిస్తామని అమీన్పూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్ అన్నారు. ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం శ్రీ వాసవి మాత జయంతి పురస్కరించుకొని ఆదివారం బీరంగూడ మల్లికార్జున స్వామి దేవాలయం ప్రాంగణంలో ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాసవి మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సమాజ సేవలో ఆర్యవైశ్యుల పాత్ర అభినందనీయమని అన్నారు.ఈ కార్యక్రమంలో అమీన్పూర్ మాజీ ఎంపీపీ దేవానందం, సీనియర్ నాయకులు రమేష్ గౌడ్, జ్ఞానేశ్వర్, ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

## కురుమలు రాజకీయంగా ఎదగాలి

### తెలంగాణ రాష్ట్ర గొర్రెల మేకల పెంపకం దార్ల సంక్షేమ సంఘం రాష్ట్ర చైర్మన్ బాపు మల్ శెట్టి



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 26, నారాయణఖేడ్ :** నారాయణఖే డివిజన్- మనూర్ మండలం రాయిపల్లి గ్రామంలో శ్రీశ్రీశ్రీ కామా రతి-బీరప్ప స్వామి కళ్యాణ మహోత్సవం బీర్ల డోలులతో భాజా భజంత్రీతో బోనాలతో అన్నదాన కార్యక్రమం తో అంగరంగ వైభవంగా ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర గొర్రెల మేకల పెంపకం దారుల సంక్షేమ సంఘం రాష్ట్ర చైర్మన్ బాపు మాల్ శెట్టి పాల్గొని శ్రీశ్రీశ్రీ కామ రాతి-బీరప్ప స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు బాపు మల్ శెట్టి మాట్లాడుతూ కురుమలు రాజకీయంగా ఆర్థికంగా సామాజికంగా ఎదగాలని కోరారు. రాబోయే స్థానిక సంస్థ ఎన్నికలలో కురుమలు జడ్పిటిసి ఎంపిటిసిలుగా పోటీ చేయలని సూచించారు ఈ కార్యక్రమంలో గొర్రెల మేకల పెంపకం దార్ల సంక్షేమ సంఘం నారాయణఖేడ్ నియోజకవర్గం అధ్యక్షులు డి ఓం ప్రకాష్. కురుమ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు నర్సింలు. మాజీ సర్పంచ్ రాంచందర్ ముదిరాజ్. బీసీ సంఘం నాయకులు రాజశేఖర్. నర్వ మాణిక్యం ముదిరాజ్. కురుమ సంఘం మండల ఉపాధ్యక్షులు విశ్వనాథ్ కురుమ సంఘం గ్రామ పెద్దలు ప్రభాకర్ . విట్టల్. భూమయ్య. అశోక్. రాజు తదితరులు పాల్గొన్నారు.

## వేసవిలో మిషన్ భగీరథ నీళ్లు లేక 4 గ్రామాల ప్రజలకు ఇబ్బందులు

### పట్టించుకొని అధికారులు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 26, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:** కొమరంబీమ్ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ నియోజకవర్గం బెజ్జూర్ మండలం పరిధిలోని మారుమూలఆదివాసీ గ్రామాలలో గత 20రోజుల నుండి మిషన్ భగీరది నీళ్లు, సోమిని, గేర్రెగూడ, మొగెల్లి, ఇప్పలగూడ, దొడ్డుగూడ గ్రామాలకు సరఫరా లేదని,అధికారులకు చెప్పిన పట్టించుకోవడం లేదని ఎండ తీవ్రత దృశ్యా నీళ్లు అత్యవసరమని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మిషన్ భగీరది నీళ్ళు సరఫరా చేయాలని గ్రామస్తులువేడుకొంటున్నారు. ఇట్టి విషయం పై చరవాణి ద్వారా వివరణ కోరగా మిషన్ భగీరది నీళ్ళు సరఫరా లేదని, పైప్ లికేజి ఉన్నందున మరమ్మతులు చేయిస్తానని ఒక మెకానికసిబ్బంది ఉన్నందున ఆలస్యం అవుతుందని ఏది ఏమైనా ఎండ తీవ్రత దృశ్యగ్రామస్తులకు అతి త్వరలో మిషన్ భగీరది నీళ్లు సరఫరా అవుతుందని తెలిపారు

## కొలనుపాక ఆర్యవైశ్య సంఘం నూతన కమిటి ఎన్నిక



హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 26, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం కొలనుపాక గ్రామంలోని ఆర్యవైశ్య సంఘం నూతన కమిటి ఎన్నిక, అధ్యక్షులుగా ప్రొద్దుటూరి రమేష్ గుప్తా, ఉపాధ్యక్షులు దిడిగం అంజయ్య గుప్తా, ప్రధాన కార్యదర్శి కాశెట్టి శ్రవణ్ కుమార్ గుప్తా, కోశాధికారిగా నంగునూరి. కృష్ణమూర్తి గుప్తా, ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో దిడిగం వీరయ్య గప్తా, కస్తూరి వెంకటేష్ గుప్తా, మిర్యాల ఉమామహేశ్వర్ గుప్తా, ఆర్యవైశ్య సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## యోగా కాలక్షేపం కాదు జీవన విధానం : చైర్‌పర్సన్ తంగాళ్ళపల్లి శ్రీవాణి రవి కుమార్




హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 26, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : భువనగిరి '99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా మున్సిపల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో 'హ్యాపీ సండే-యోగా' కార్యక్రమాన్ని భువనగిరి కొండ ప్రాంతంలో ఘనంగా నిర్వహించారు. వందలాది మంది ప్రజలు, మహిళలు, యువత ఉత్సాహంగా పాల్గొని యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ తంగాళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ మాట్లాడుతూ, యోగా కాలక్షేపం కాదు జీవన విధానం "యోగాను కేవలం ఆదివారం కార్యక్రమానికి పరిమితం చేయొద్దు. ప్రతిరోజూ ఉదయం 20 నిమిషాలు ఇంట్లో కుటుంబ సభ్యులతో కలిసి యోగా చేయడం అలవాటు చేసుకోవాలి. ఇది శారీరక, మానసిక



ఆరోగ్యాన్ని పెంచుతుంది. ఒత్తిడిని తగ్గించి రోజంతా ఉత్సాహంగా ఉంచుతుంది. పిల్లలకు చిన్నప్పటి నుంచే యోగా నేర్పితే వారి ఏకాగ్రత, ఆరోగ్యం మెరుగుపడుతుంది" అని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంసీబీ వైస్ చైర్మన్ పి.మంజుల మరియు స్థానిక క్రీడాకారులు సీనియర్ సిటిజెన్స్ వాకర్స్ తదితరులు పాల్గొన్నారు

## ఆలేరు వైశ్య సంఘం ఆధ్వర్యంలో సిఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలభిషేకం




హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 26, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : తెలంగాణ ప్రభుత్వం వాసవి మాత జయంతి ని అధికారిక ఉత్సవముగా ప్రకటించించినదుకు కృతజ్ఞతలు తెలుపుతూ ఆలేరు మండల మరియు పట్టణ వైశ్య సంఘం ఆధ్వర్యంలో సిఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలభిషేకం చేసారు, ఈ సందర్భంగా సంఘం మండల అధ్యక్షులు కొలనుపాక వార్డు మెంబర్ నాగబండి మధుసూదన్ మాట్లాడుతూ... సిఎం రేవంత్ రెడ్డి కి వైశ్యులు రుణపడి ఉన్నారని ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయడమే కాకుండా వాసవి మాత జయంతి ని అధికారిక ఉత్చవంగా ప్రకటించి వైశ్యుల మనసు గెలుచుకున్నరన్నారు ఈ కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ సముద్రాల సత్యం, సంఘం నాయకులు చోళ్ళేటి ప్రకాష్, గందె అంజయ్య, సముద్రాల శ్రీనివాస్, పొద్దుటూరి ఉపేందర్, మంచన మల్లేశం, బెలిదే కాశినాథ్, మంతపురి వెంకటేష్, తోట ప్రశాంత్, సరాబ్ లక్ష్మణ్, సముద్రాల రవి, నాగబండి నాగేందర్, చోళ్ళేటి రాజేష్, చోళ్ళేటి నాగయ్య, బెలిదే సంతోష్, గోరేంటి ఉపేందర్, పద్మ ప్రవీణ్, బచ్చు మణికంఠ మరియు సంఘం సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## దుర్గమ్మ పండుగ నిర్వహణపై ప్రత్యేక సమావేశం

హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 26, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : రాజపేట మండలం చల్లూరు గ్రామ దేవత శ్రీ కనకదుర్గమ్మ తల్లి పండుగ నిర్వహణపై ఆదివారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ పెద్దలు, ప్రజా ప్రతినిధులు అధ్వర్యంలో సమావేశం జరిగింది. అందరి అభిప్రాయాలతో పండుగ తేదీలు ఖరారు చేశారు. మే 30 శనివారం రాత్రి అమ్మవారికి బోనాల సమర్పణ, మే 31 ఆదివారం గ్రామ వనభోజనాలు కార్యక్రమాలు నిర్వహించాలని తీర్మాణం జరిగింది. గ్రామస్థులందరూ కలిసి పండుగను ఘనంగా జరుపుకోవాలని అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు. సర్పంచి భీమగాని రూప బాల నరసయ్య గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బొంత సుధాకర్, వార్డు సభ్యులు గ్రామ పెద్దలు కుల పెద్దలు నాయకులు పలువురు ముఖ్యులు ప్రజలు ఉన్నారు.

## డబ్బా పెట్రోల్ బంక్ లో వినియోగదారులకు సౌకర్యాలు కరువు

### పట్టించుకోని సంబంధిత అదికారులు



హైదూాఖాద్ ప్ఢ్ ఙ్యాూణ, ఏ్వప్ద్ 26, కొజుయుఁం బీం ఆణిఢాఖాద్ జ్లాా వ్పతినిదీ: కొజుయుఁం బీఁ ఆణిఢాఖాద్ జ్లాా చింతలజుాన్పల్లి జుండలం డఖ్బా వ్గాజు ణమీపు ప్వెట్ద్ బంక్ద్ వినిజ్వూగదాపులకు 10దూఋంట్ట తక్కుజు దూఋంట్ట ప్వెట్ద్ ణిబ్బంది దీళఖాఖిఁని, హణీదు ఇజ్వుఁని, నిజీజుానిబంధ్నలకు విఘద్ధంగా ప్వెట్ద్, డీజ్ద్ క్యాన్, డఖ్బాల్ద్ చీజుయ్మతాఁని ఇష్టాఋఖాఁంగా, ణిబ్బంది జ్యుజుపరిణఖిన్నాఁని, వీండ ్వజుత ఉ్నందుఁ వ్తాగుటకు ్ళ్లల్ల వినిజ్వూదుఁలకు ఇజ్వుడం్ద;దని వ్దాథమిక ణేజులు, జ్బులిక ణదుదాజీలు,, చీదుఁపు ఖఽకరా్యాలు, శ్వ్యదత ఖఽకరా్యాలు ణరిగ్గా;జుని వినిజ్వూగదాఁలు ఆ్దఁ జ్యుకఖిం ఛ్ఢఁ. ణంబంధిత చీదికాఁలు క్ష్వత ఖ్ఞిద్ పణ్యట్చంచి బంక ల్ద్ వ్వినిజ్వూగదాపులకు ఖఽకరా్యాలు కల్పించాలని,్ద;నిజ్వుడల చట్టపుఘ్నూ చ్యులు =ఘకోలని కోాఁ.

## ప్రమోషన్ రీత్యా వెళ్తున్న బిల్ కలెక్టర్ సమీర్ కు ఘన సన్మానం



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 26, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం కొలనుపాక గ్రామపంచాయతీ బిల్ కలెక్టర్ సమీర్ ప్రమోషన్ రీత్యా వంగపల్లి గ్రామపంచాయతీకి జూనియర్ అసిస్టెంట్ గా వెళుతున్న సందర్భంగా గ్రామ సర్పంచ్ బెదరబోయిన యాకమ్మ వెంకటేష్, బిఆర్ఎస్ నాయకులు రఘుపతి రెడ్డి, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సమీర్ మాట్లాడుతూ కొలనుపాక గ్రామంలో ఆరు సంవత్సరాలుగా పనిచేసే అందరి ఆదరభిమానాలు పొందానని గ్రామాన్ని విడిచి వెళ్లడానికి నాకు బాధగా ఉందని ప్రమోషన్ రీత్యా వెళ్తున్నానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో తేరాల నరసింహులు, భోగ శ్రీనివాస్ , బొంకూరి మల్లేష్, మామిడాల నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో చేరికలకు అవగాహన.



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 26, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:** కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో ప్రజాపాలన 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఆదివారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఆసిఫాబాద్ బాలికల ఆశ్రమ పాఠశాల స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని పలు గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి బడి ఈడు పిల్లలను పాఠశాలలో చేర్పించేందుకు తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ రిసోర్స్ పర్సన్ రాథోడ్ రవీందర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమంలో నాణ్యమైన విద్య అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, రెండు జతల యూనిఫామ్‌లు, సన్నబియ్యం భోజనం, సహపాఠ్య కార్యక్రమాలు అందిస్తూ సమగ్ర అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో కూడా ఆంగ్ల మాధ్యమ విద్య ద్వారా విద్యార్థుల భవిష్యత్తును మెరుగుపరుస్తున్నట్లు వివరించారు.

# జిల్లా పోలీసు కార్యాలయంలో వాసవి కన్యకా పరమేశ్వరి మాత జయంతి వేడుకలు




హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 26, సంగారెడ్డి జిల్లా ప్రతినిధి:
ఈ సందర్భంగా ఆర్ఐ డానియెల్ మాట్లాడుతూ, వాసవి కన్యకా పరమేశ్వరి మాత గారి జీవితం శాంతి, అహింస, ధైర్యం, త్యాగం, సమానత్వం వంటి ఉన్నతమైన విలువలకు ప్రతీక అని తెలిపారు. ఆమె చూపిన మార్గం సమాజానికి ఎల్లప్పుడూ మార్గదర్శకమని పేర్కొన్నారు. ప్రస్తుతం సమాజంలో శాంతి, సహనం, పరస్పర గౌరవం వంటి విలువలను పెంపొందించుకోవడం అత్యంత అవసరమని, ప్రతి ఒక్కరూ ఈ విలువలను తమ దైనందిన జీవితంలో ఆచరించి సమాజ అభివృద్ధికి తోడ్పడాలని ఆయన సూచించారు. వాసవి మాత ఆశీస్సులు అందరికీ లభించాలని, సమాజంలో శాంతి, ఐక్యత, సౌభ్రాతృత్వం మరింత బలపడాలని ఆకాంక్షిస్తూ జిల్లా ప్రజలకు వాసవి మాత జయంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రాజశేఖర్ రెడ్డి, జిల్లా పోలీసు కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గుండాలలో సోయం బొజ్జిరావు 30వ వర్ధంతి నిర్వహణ....



హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 26, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి::
కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి మండలం గుండాల గ్రామంలో సోయం బొజ్జిరావు 30వ వర్ధంతి ఆదివారం ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ ఆడ సోము, అశోక్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు, గ్రామస్తులు పాల్గొని నివాళులు అర్పించారు.కార్యక్రమానికి కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి కుర్సింగా శోభన్, ఆదివాసి నాయకుడు పెందోర్ దార్ము సహా పలువురు హాజరయ్యారు. పాల్గొన్న వారు బొజ్జిరావు సేవలను స్మరించుకున్నారు

# జనగణన - 2027 స్వీయ గణనపై దృష్టి




హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 26, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:
కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో జనగణన-2027లో భాగంగా స్వీయ గణన ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్ సూచించారు. ఆదివారం కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడారు.జనగణనను రెండు విడతల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. మే 11 నుంచి జూన్ 9 వరకు ఇండ్ల గణన, అనంతరం జనగణన చేపడతారు. ఏప్రిల్ 26 నుంచి మే 10 వరకు స్వీయ గణన పోర్టల్ అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు.డిజిటల్ విధానంతో ఖచ్చితమైన వివరాలు సేకరించేందుకు ప్రజలు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుని, అధికారులకు సరైన సమాచారం అందించాలని కోరారు.

### లింగాల దేవదాసు
## కుటుంబానికి ఆర్థిక సాయం



హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 26, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : రాజపేట మండలం పాముకుంట గ్రామానికి చెందిన లింగాల దేవదాసు ఇటీవల వడదెబ్బతో మృతి చెందగా ఆదివారం కుటుంబానికి పాముకుంట గ్రామస్తుల సహకారంతో 16 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేసారు. ఈ కార్యక్రమంలో పాముకుంట వార్డ్ సభ్యులు రంగ నరేష్, బచ్చలి శేఖర్, సామాజికవేత్త గొడుగు బాలరాజు, కాకల నవీన్ కుమార్, వెంకటాపురం అశోక్, పట్నం గణేష్ తదితరులు పాల్గొన్నారు

# మహబూబాబాద్‌లో ఎక్సైజ్ దాడులు...

## నల్ల బెల్లం, పటిక భారీగా పట్టివేత.. నిందితుడు అరెస్ట్

**హైదరాబాద్ పల్స్, ఏప్రిల్ 26, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి:**
రాష్ట్రాన్ని గుడుంబా, డ్రగ్స్ రహితంగా తీర్చిదిద్దేందుకు ఎక్సైజ్ శాఖ చేపట్టిన ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా మహబూబాబాద్ జిల్లాలో అధికారులు కీలక చర్యలు చేపట్టారు. ప్రోహిబిషన్ & ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసీం ఆదేశాలు, జేసీ ఎన్ఫోర్స్మెంట్ మరియు వరంగల్ డీసీ అంజన్‌రావు మార్గదర్శకత్వంలో ఈ నెల 21వ తేదీ నుంచి ప్రత్యేక తనిఖీలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో ఆదివారం ఉదయం సుందరయ్య నగర్ – ఎటిగడ్డ తండా మధ్య ప్రాంతంలో వాహన తనిఖీలు నిర్వహించిన ఎక్సైజ్ బృందం, అనుమానాస్పదంగా వెళు తున్న ఆశోక్ లేలాండ్ బడా దోస్త్ (ఏపీ 39 టీటీ 3752) వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా, అక్రమంగా తరలిస్తున్న 1750 కిలోల నల్ల బెల్లం,100 కిలోల పటిక, 20 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుంది.ఈ ఘటనలో కొరవి రవితేజ (చిలకలూరిపేట) ను అదుపులోకి తీసుకుని విచారణ జరపగా, అతను బానోత్ ప్రసాద్ (సూర్య తండా, సిరోల్ మండలం)తో కలిసి చిత్తూరు ప్రాంతం నుంచి తక్కువ ధరకు ముడి పదార్థాలు తెచ్చి, స్థానిక తండాలలో అధిక ధరలకు విక్రయిస్తూ, అక్కడి నుంచి నాటు సారాను కొనుగోలు చేసి పట్టణాల్లో అమ్ముతున్నట్లు ఒప్పుకున్నాడు. ఈ వ్యాపారంలో వచ్చిన లాభాలను ఇద్దరూ సమానంగా పంచుకుంటున్నట్లు వెల్లడించాడు. నిందితుడిని, వాహనం మరియు స్వాధీనం చేసుకున్న సరుకులను మహబూబాబాద్ ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించి తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రొహిబిషన్ & ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జి. చిరంజీవి మాట్లాడుతూ, గుడుంబా తయారీ, రవాణా, విక్రయాల్లో పాల్గొనే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందని, నేరాలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా డ్రగ్స్, గుడుంబా రహిత రాష్ట్ర నిర్మాణంలో ప్రజలు, యువత, మీడియా సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సీఐలు నాగేశ్వరరావు, చంద్రశేఖర్‌తో పాటు సిబ్బంది సత్యనారాయణ, శ్రీనివాస్ కుమార్, శరత్ పాల్గొన్నారు.




# ఎండాకాలంలో జాగ్రత్తలు పాటించాలి : జిల్లా పోలీసుల విజ్ఞప్తి

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 26, సంగారెడ్డి జిల్లా ప్రతినిధి:**
ఎండాకాలంలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా అగ్ని ప్రమాదాలు, చెరువుల వద్ద ప్రమాదాలు, దొంగతనాలు పెరిగే అవకాశాలు ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ సూచించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో గడ్డి వాములు, ఎండిన పంట అవశేషాల దగ్గర చిన్న నిర్లక్ష్యం కూడా భారీ అగ్ని ప్రమాదాలకు దారి తీసే అవకాశం ఉందని తెలిపారు. రైతులు పొలాల వద్ద అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగపడేలా నీటి తొట్లు ఏర్పాటు చేసుకోవాలని, ఎండిన గడ్డి సమీపంలో మంటలు వేయకూడదని సూచించారు. వంటల అనంతరం పొయ్యిని పూర్తిగా ఆర్పకుండా బయటకు వెళ్లడం ప్రమాదకరమని హెచ్చరించారు. అలాగే వేసవిలో ప్రజలు ఇళ్ల బయట, మేడలపై నిద్రించే సమయంలో దొంగతనాల ప్రమాదం ఉండటంతో ఇళ్ల భద్రతపై శ్రద్ధ వహించాలని కోరారు. చెరువులు, కుంటల వద్ద ఈతకు వెళ్లేటప్పుడు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, చిన్నపిల్లలు పెద్దల పర్యవేక్షణలోనే నీటిలోకి వెళ్లాలని, లోతు తెలియని ప్రాంతాల్లో ఈతకు దిగకూడదని సూచించారు. మద్యం సేవించి నీటిలోకి వెళ్లడం పూర్తిగా ప్రమాదకరమని హెచ్చరించారు. ఏదైనా అత్యవసర పరిస్థితి తలెత్తిన వెంటనే 100, 112 లేదా జిల్లా పోలీసు కంట్రోల్ రూమ్ నెంబర్ 8712656739కు సమాచారం అందించాలని తెలిపారు. గత వేసవిలో జిల్లాలో 7 అగ్ని ప్రమాదాలు, 50 దొంగతనాలు, 23 చెరువుల ప్రమాదాలు నమోదైనట్లు పేర్కొంటూ, అప్రమత్తతే ప్రాణ రక్షణకు మార్గమని ఎస్పీ తెలిపారు.




# తెలంగాణ మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం గుడ్ న్యూస్

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 26, మెయిన్ డెస్క్:**
తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలోని మహిళలకు గుడ్ న్యూస్ తెలిపింది. ఇప్పటికే మహిళలకు అనేక పథకాలను అందించింది రేవంత్ సర్కార్. రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా పెట్టుకుంది. ఇక తాజాగా మహిళల విద్య, ఉపాధిపై తమ ప్రభుత్వం ప్రత్యేకమైన దృష్టి సారించిందని మంత్రి సీతక్క తెలిపారు. త్వరలోనే మహిళా సంఘ సభ్యుల ఎడ్యుకేషన్ ప్రొఫైల్ ను ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. మహిళా సంఘ సభ్యుల్లో ఎవరూ నిరక్షరాస్యులుగా మిగలకుండా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఈ మేరకు తాజాగా బీఆర్‌కే భవన్ లో సెర్ఫ్ డైరెక్టర్లు, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షులతో మంత్రి సీతక్క సమీక్షా సమావేశం జరిపారు.మహిళలకు మంత్రి సీతక్క గుడ్ న్యూస్ తెలిపారు. ప్రతి మహిళ అక్షరాస్యురాలిగా ఉండటమే తమ ప్రభుత్వం లక్ష్యమని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. మహిళలకు అక్షరజ్ఞానంతో పాటు వారి విద్యార్హతలను గుర్తించి ఉన్నత విద్య అవకాశాలు కల్పిస్తామని ప్రకటించారు. ఈ మేరకు మహిళా సభ్యుల ఎడ్యుకేషన్ ప్రొఫైల్స్ ను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఇక రాష్ట్రవ్యాప్తంగా 8,227 గ్రామ మహిళా సంఘ భవనాలకు అనుమతులు మంజూరు అయ్యాయని అందులో 5,239 గ్రామాల్లో మహిళా భవనాల నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ప్రస్తుతం 5 వేలకుపైగా వీఓ భవనాలు నిర్మాణంలో ఉన్నాయన్నారు. వచ్చే ఏడాది మరో ఐదు వేల భవనాలు నిర్మిస్తామన్నారు.అలాగే అమ్మకు అక్షరమాల కార్యక్రమం ద్వారా ఇప్పటివరకు 6.5 లక్షల మహిళలకు అక్షరజ్ఞానం కల్పించామని వెల్లడించారు. త్వరలోనే మరో 6 లక్షల మందికి గ్రామ స్థాయిలోనే విద్యాబోధన చేపడతామని మంత్రి సీతక్క వివరించారు. ఇక రాష్ట్రంలోని మహిళల ఆర్థికాభివృద్ధికి ముఖ్యమంత్రి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని పేర్కొన్నారు. ప్రతి మహిళా సంఘం ఆర్థిక క్రమశిక్షణతో పని చేయాలని సూచించారు. వేసవి సెలవులను సద్వినియోగం చేసుకునేందుకు టీనేజ్ బాలికల కోసం స్నేహ సమ్మర్ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నామని మంత్రి సీతక్క తెలిపారు. బాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.




# ధురంధర్ ఎఫెక్ట్: పాక్ లో వరుసగా లష్కరే తోయిబా ఉగ్రవాదులు హతం.. తాజాగా మరో సీనియర్ కమాండర్.!

హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 26 :
పాకిస్తాన్ లోని లష్కర్-ఎ-తొయిబా ఉగ్రవాద సంస్థకు చెందిన ఓ సీనియర్ కమాండర్ ను గుర్తు తెలియని వ్యక్తులు కాల్చి చంపినట్లు వార్తలు వస్తున్నాయి. ఈ ఘటన దేశంలో అంతర్గత భద్రత, ఉగ్రవాదుల భద్రతపై కొత్త ఆందోళనలకు దారితీసింది. ఖైబర్ పఖ్తూన్‌ఖ్వా ప్రాంతంలో జరిగిన ఈ ఘటనలో లష్కర్ ప్రాంతీయ నెట్ వర్క్ లో కీలక వ్యక్తిగా భావిస్తున్న షేక్ యూసుఫ్ అఫ్రిది లక్ష్యంగా మారారు. గత కొద్ది నెలలుగా ఇలాంటి వరుస దాడుల్లో పలువురు ప్రముఖ ఉగ్రవాదులు మృత్యువాత పడ్డారు.లష్కర్-ఎ-తొయిబా సీనియర్ కమాండర్ షేక్ యూసుఫ్ అఫ్రిదిని ఖైబర్ పఖ్తూన్‌ఖ్వాలో గుర్తు తెలియని వ్యక్తులు అతనిపై కాల్పులు జరపడంతో అతను మరణించినట్లు నివేదించారు. వాళ్లు అకస్మాత్తుగా దాడి చేయడంతో అతను స్పందించడానికి సమయం దొరకలేదని నివేదికలు చెబుతున్నాయి. ఈ ప్రాంతంలో ఆ సంస్థ కార్యకలాపాలకు అఫ్రిదీ కీలకమైన కమాండర్. అతని మరణం భద్రతా ఏజెన్సీలు, ఉగ్రవాద కార్యకలాపాలను పరిశీలించేవారిలో ఆశ్చర్యం కలిగించింది.ఈ హత్యతో పాకిస్తాన్‌లోని అనేక ప్రాంతాలలో గుర్తు తెలియని వ్యక్తుల చేతిలో ఉగ్రవాదులు లక్ష్యంగా అవుతున్న ధోరణి స్పష్టమవుతోంది. పంజాబ్, సింధ్, బలూచిస్థాన్, ఖైబర్ పఖ్తూన్‌ఖ్వా వంటి ప్రాంతాల్లో ఈ సంఘటనలు ఒకప్పుడు స్వేచ్ఛగా తిరిగినవారిలో కూడా భయాన్ని కలిగించాయి. దాడి చేసిన వారి గుర్తింపు ఇప్పటికీ అస్పష్టంగానే ఉంది. ఇది ఈ లక్షిత హత్యల చుట్టూ ఉన్న రహస్యాన్ని మరింత పెంచుతుంది.2026 ప్రారంభం నుంచి లష్కర్-ఎ-తొయిబా, హిజ్బుల్ ముజాహిదీన్ వంటి సంస్థలతో సంబంధం ఉన్న 30 మందికి పైగా ఉగ్రవాదులు లాహోర్, కరాచీ సహా ఇతర నగరాల్లో ఇలాంటి దాడుల్లో మరణించినట్లు సమాచారం. ఈ సంఘటనలు ఒక నిర్దిష్ట నమూనాను సూచిస్తున్నాయి, అయితే ఇప్పటి వరకు ఏ సమూహమూ ఈ దాడులకు బాధ్యత వహించినట్లు ప్రకటించలేదు.ఈ నెల ప్రారంభంలో, హఫీజ్ సయీద్‌కు సన్నిహితుడైన సీనియర్ వ్యక్తి ఆమిర్ హంజా లాహోర్‌లో జరిగిన కాల్పుల్లో గాయపడ్డారు. ఈ వరుస దాడులు అంతర్గత విరోధాలు లేదా ఉగ్రవాద నాయకత్వాన్ని లక్ష్యంగా చేసుకున్న రహస్య కార్యకలాపాలపై ఊహాగానాలను పెంచుతున్నాయి.పాకిస్తాన్ అధికారులు ఈ విషయంపై అధికంగా మౌనం వహించారు. ఇప్పటివరకు కొన్ని అధికారిక ప్రకటనలు మాత్రమే విడుదలయ్యాయి. స్పష్టత లేకపోవడం అనిశ్చితిని మరింత పెంచింది. ఈ హత్యల వెనుక ఎవరున్నారు, ఈ ప్రాంతంలో పనిచేస్తున్న ఉగ్రవాద నెట్‌వర్క్‌ల భవిష్యత్తుకు దీని అర్థం ఏమిటి అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.



# నా కూతురు అమాయకురాలు.. ఆమె తల్లే చెడగొట్టింది: అషురెడ్డి తండ్రి షాకింగ్ కామెంట్స్

హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 26, సెంట్రల్ డెస్క్: ఎన్నారై ఐటీ ఉద్యోగిని మోసం చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న బిగ్ బాస్ ఫేమ్ అషురెడ్డి వ్యవహారంలో ఆమె తండ్రి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు హాట్ టాపిక్ అయ్యాయి. తన కూతురు చేసిన తప్పులకు తన భార్యనే కారణమని, అషురెడ్డిని ఆమె తల్లే చెడగొడుతోందని ఆయన బాహాటంగా విమర్శించారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. "అషు తన తల్లి చెప్పినట్లే వింటుంది. ఆమె తల్లే అషును చెడగొడుతోంది. అషును పూర్తిగా మార్చేసింది" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఫిర్యాదు చేసిన ధర్మేంద్రకు ఇదివరకే పెళ్లి అయ్యిందన్న విషయం తెలిసినప్పటికీ.. అషురెడ్డి అతనితో పెళ్లికి సిద్ధపడిందని ఆయన ధృవీకరించారు. ధర్మేంద్ర నుంచి అషురెడ్డి డబ్బులు తీసుకున్న మాట వాస్తవమేనని ఆయన అంగీకరించారు.

కాల్ మనీ సంబంధాలు..

ధర్మేంద్ర కుటుంబానికి 'కాల్ మనీ' కేసులతో సంబంధాలు ఉన్నాయని అషురెడ్డి తండ్రి సంచలన ఆరోపణలు చేశారు. తన కూతురు అమాయకురాలని, తెలియక ఈ ఊబిలో చిక్కుకుందని చెప్పుకొచ్చారు. "నా కూతురు చేసిన తప్పులకు తండ్రిగా నేనూ శిక్ష అనుభవించాల్సిందే. ఈ పరిస్థితులు చూస్తుంటే చాలా బాధగా ఉంది" అని ఆయన వాపోయారు. ఒకవైపు కోట్ల రూపాయల వసూళ్ల ఆరోపణలు, మరోవైపు తండ్రే స్వయంగా తన భార్యపై, కూతురిపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. పెళ్లి చేసుకుంటానని నమ్మించి తన వద్ద నుంచి సుమారు రూ. 9.35 కోట్లు వసూలు చేసిందని ధర్మేంద్ర అనే వ్యక్తి హైదరాబాద్ సీసీఎస్‌లో ఫిర్యాదు చేయడంతో అషురెడ్డిపై కేసు నమోదైన సంగతి తెలిసిందే. ఇప్పుడు తండ్రి వ్యాఖ్యలు ఈ కేసులో పోలీసుల విచారణకు కీలక సమాచారంగా మారే అవకాశం ఉంది.



# వంట నూనెను విడిగా అమ్మొద్దు.. హెచ్ - ఫాస్ట్ పోలీసుల హెచ్చరిక

హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 26, సిటీ క్రైమ్: కల్తీని అరికట్టే క్రమంలో హైదరాబాద్ ఫుడ్ అడల్ట్రేషన్ సర్వేలేన్స్ టీం-హెచ్ ఫాస్ట్ పోలీసులు ఆదివారం హైదరాబాద్ వంట నూనె విక్రయించే వ్యాపారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో హెచ్ ఫాస్ట్ డీసీపీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ మాట్లాడుతూ.. వ్యాపారులు వంట నూనెను విడిగా అమ్మొద్దని స్పష్టం చేశారు. సీల్ ప్యాకేజింగ్, టిన్‌లలోనే అమ్మాలన్నారు. వంట నూనెను ఇతర నూనెలతో కలిపి కల్తీ చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు.నూనెను తయారు చేసే చోట పరిశుభ్రతను పాటించాలన్నారు. వంట నూనెకు సంబంధించి బ్రాండింగ్ నిబంధనలు పాటించాలన్నారు. 15 రోజుల పాటు గడువు ఇస్తున్నట్లు ఆ తర్వాత జరిగే సోదాల్లో నిబంధనల ఉల్లంఘన, విడిగా నూనె అమ్మకాలు జరిగినట్లు దొరికితే జైలు తప్పదని ఆయన తేల్చి చెప్పారు. కల్తీ చేసే వ్యాపారుల పై బీఎన్ఎస్ సెక్షన్‌లతో పాటు ఆహార కల్తీ నిరోధక చట్టం కింద అభియోగాలను నమోదు చేస్తామన్నారు. పాటించాల్సిన నిబంధనల పై డీసీపీ వ్యాపారులకు వివరించారు.

**నూనె విక్రయదారులు పాటించాల్సిన నిబంధనలు ఇలా..**

**ప్యాకేజింగ్ తప్పనిసరి.**

విక్రయించబడే ప్రతి నూనె ప్యాకెట్ లేదా టిన్ సీల్ చేసి ఉండాలి. బ్యాచ్ నెంబర్ కూడా తప్పనిసరిగా కనిపించాలి.

పారదర్శకమైన లేబులింగ్ ఉండాలి. తయారీ తేదీ, గడువు తేదీలు స్పష్టంగా ఉండాలి.

ఎఫ్ఎస్ఎస్ఏఐ(ఫుడ్ సేఫ్టీ, స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా)లైసెన్స్ నెంబర్ స్పష్టంగా ఉండాలి.

వంట నూనె తయారీలో హానికరమైన రసాయనాలు, నాణ్యత తక్కువగా ఉన్న నూనెలను కలిపి కల్తీ చేస్తే లైసెన్స్ రద్దవుతుంది.

నూనె తయారీ, నిల్వ ఉన్న కేంద్రాల్లో ఆహార భద్రతా ప్రమాణాలను పాటించాలి.

ఈ నిబంధనలను ఎవరు ఉల్లంఘించిన చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయని డీసీపీ రఘునాథ్ స్పష్టం చేశారు. ప్రజలు కూడా తక్కువ ధరకు నూనె దొరుకుతుందని వాటిని వినియోగించి అనారోగ్యానికి గురి కావద్దని తెలిపారు. కల్తీ నూనె తయారీకి సంబంధించిన స్థావరాల సమాచారం ఉంటే వెంటనే డయల్ 100 లేదా హెచ్ ఫాస్ట్ నెంబరు 8712661212 కు తెలపాలని కోరారు.




# ఇరాన్‌లో ఒక గుడ్డు ధర అక్షరాలా..:ఆధునిక కరువు అంటే ఇదేనా?

హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 26, సెంట్రల్ డెస్క్: ఇరాన్ ప్రస్తుతం ఒక విచిత్రమైన, అత్యంత భయంకరమైన పరిస్థితిని ఎదుర్కొంటోంది. సరిహద్దుల్లో యుద్ధ ట్యాంకులు గర్జిస్తుంటే, అంతర్గతంగా ఆ దేశం ఆర్థిక సునామీలో చిక్కుకుంది. బయటకు అమెరికా వంటి అగ్రరాజ్యాలను ధీటుగా ఎదుర్కొంటున్నట్లు కనిపిస్తున్నా, సామాన్యుడి వంటగదిలో మాత్రం ఆకలి మంటలు చెలరేగుతున్నాయి. నిత్యావసరాల ధరలు సామాన్యుడికి అందనంత ఎత్తుకు చేరుకోవడంతో, ఇరాన్ ఇప్పుడు 'ఆధునిక కరువు' అంచున నిలబడింది.

నిత్యావసరాలు.. సామాన్యుడికి 'విలాసాలు'

ఇరాన్‌లో ఆహార ద్రవ్యోల్బణం ఏకంగా 112 శాతానికి చేరుకుంది. నిన్నమొన్నటి వరకు అందుబాటులో ఉన్న వస్తువులు ఇప్పుడు 'లగ్జరీ' వస్తువులుగా మారిపోయాయి. తాజా మార్కెట్ విశ్లేషణల ప్రకారం మన రూపాయిల్లో ధరల పరిస్థితి ఇలా ఉంది:

కోడిగుడ్లు: ఒక్కో గుడ్డు ధర సుమారు1.5 లక్షల రియాల్స్ (దాదాపు రూ.10) కు పైగా పలుకుతోంది.

బియ్యం: కిలో బియ్యం కొనాలంటే సామాన్యుడు వేలల్లో వెచ్చించాల్సి వస్తోంది.

వంట నూనె: దీని ధరలు ఏకంగా 200% పెరిగాయి.

పాలు: లీటరు పాల ధర సుమారు 8 లక్షల రియాల్స్ (సుమారు రూ.55) మార్కును తాకుతోంది.

చివరికి మనిషి చనిపోతే అంత్యక్రియలు నిర్వహించడానికి అయ్యే ఖర్చులు కూడా 40% పెరగడం అక్కడి దయనీయ స్థితికి అద్దం పడుతోంది.

కుప్పకూలిన కరెన్సీ.. కనుమరుగైన ఉద్యోగాలు

ఇరాన్ కరెన్సీ 'రియాల్' విలువ పాతాళానికి పడిపోయింది. ప్రస్తుతం ఒక అమెరికన్ డాలర్ విలువ దాదాపు 16 లక్షల రియాల్స్ కు చేరువలో ఉంది. దీనివల్ల ప్రజలు దాచుకున్న పొదుపు సొమ్మంతా ఆవిరైపోతోంది. యుద్ధం మొదలైనప్పటి నుండి సుమారు 10 లక్షల మంది అధికారికంగా ఉద్యోగాలు కోల్పోగా, అనధికారికంగా ఈ సంఖ్య 30 లక్షల వరకు ఉండొచ్చని అంచనా. దాదాపు 1.5 కోట్ల మంది ప్రజలు ఎటువంటి ఆదాయం లేక సబ్సిడీలపైనే ఆధారపడుతున్నారు. ప్రభుత్వం ఇచ్చే ఫుడ్ వోచర్లతో కనీసం 10 కిలోల బియ్యం కూడా రాని పరిస్థితి నెలకొంది.



ఆధునిక కరువు అంటే ఏమిటి?

సాధారణంగా కరువు అంటే వస్తువులు దొరక్కపోవడం. కానీ, ఇరాన్‌లో మార్కెట్లు వస్తువులతో నిండి ఉన్నాయి. కానీ వాటిని కొనే 'స్తోమత' ప్రజల దగ్గర లేదు. దీనినే ఆర్థిక నిపుణులు 'ఆధునిక కరువు' అని పిలుస్తున్నారు. జనం దగ్గర డబ్బు లేకపోవడంతో వ్యాపారాలు దెబ్బతిని రెస్టారెంట్లు, చిన్న దుకాణాలు మూతపడుతున్నాయి. బ్యాంకులు కూడా చెక్కులు బౌన్స్ అవుతున్నాయని వేలల్లో ఖాతాలను క్లోజ్ చేస్తున్నాయి.

# కుటుంబ సమేతంగా జనాభా లెక్కల స్వీయ గణన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 26, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : యాదగిరిగుట్టలో జనాభా లెక్కల స్వీయ గణన--2027 కార్యక్రమాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ భాస్కర్ రావు ఘనంగా ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా ప్రజలు స్వయంగా తమ కుటుంబ వివరాలను నమోదు చేసుకునే విధానాన్ని ప్రోత్సహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా యాదగిరిగుట్టలోని ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య నివాసానికి చేరుకున్న జేసీ భాస్కర్ రావు, ఎమ్మెల్యే తో పాటు వారి కుటుంబ సభ్యుల వివరాలను జనాభా లెక్కల స్వీయ గణన ప్రక్రియలో నమోదు చేశారు. ఈ ప్రక్రియ ద్వారా వ్యక్తిగత వివరాలు, కుటుంబ నిర్మాణం, విద్య, ఉపాధి తదితర అంశాలను సమగ్రంగా నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. స్వీయ గణన--2027లో నమోదు చేసిన వివరాలకు సంబంధించిన ధృవీకరణ ప్రతులను జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య కి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రతి కుటుంబం ఈ స్వీయ గణన కార్యక్రమంలో చురుకుగా పాల్గొని సరైన వివరాలను నమోదు చేయాలని సూచించారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, నేటి నుండి యాదాద్రి భువనగిరి జిల్లా వ్యాప్తంగా జనాభా లెక్కల స్వీయ గణన కార్యక్రమం ప్రారంభమైంది. గ్రామాలు, పట్టణాలు అన్న తేడా లేకుండా ప్రతి ఇంటికీ ఈ ప్రక్రియ చేరేలా ప్రత్యేక ఏర్పాట్లు చేయబడినట్లు వెల్లడించారు. ప్రజలు ఆన్‌లైన్ లేదా ప్రత్యక్షంగా అందుబాటులో ఉన్న సదుపాయాల ద్వారా తమ కుటుంబ వివరాలను సులభంగా నమోదు చేసుకోవచ్చని, దీనివల్ల భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికలు మరింత సమర్థవంతంగా రూపొందించుకోవడానికి ఉపయోగపడుతుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# అమిత్ షాపై లీగల్ నోటీసులకు సిద్ధమైన మమతా దీదీ.!



హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 26, సెంట్రల్ డెస్క్:
పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల సమరం రెండో దశకు చేరుకుంటున్న వేళ, అధికార తృణమూల్ కాంగ్రెస్, భారతీయ జనతా పార్టీ మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. ముఖ్యంగా సీఎం మమతా బెనర్జీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాను లక్ష్యంగా చేసుకుని లీగల్ నోటీసులు ఇచ్చేందుకు సిద్ధమవ్వడం జాతీయ రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. శనివారం హూగ్లీలో జరిగిన ఒక భారీ బహిరంగ సభలో మాట్లాడిన దీదీ, అమిత్ షా ఇటీవల చేసిన వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర హోం మంత్రి వంటి బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వ్యక్తి, ఎన్నికల ప్రచారంలో భాగంగా హింసను ప్రేరేపించేలా మాట్లాడటం ప్రజాస్వామ్యానికి విఘాతమని ఆమె మండిపడ్డారు.అమిత్ షా ఇటీవలి ర్యాలీలలో తృణమూల్ కార్యకర్తలను ఉద్దేశించి.. బెంగాల్‌లో ఎన్నికల తర్వాత "తృణమూల్ గూండాలను తలక్రిందులుగా వేలాడదీసి సరిదిద్దుతాం" అని చేసిన హెచ్చరికలు పెను దుమారం రేపాయి. ఈ వ్యాఖ్యలు నేరుగా హింసను ప్రోత్సహించేలా ఉన్నాయని, కార్యకర్తలను భయభ్రాంతులకు గురిచేసేలా ఉన్నాయని మమతా బెనర్జీ ఆరోపించారు. "మేము ఇప్పటికే లాయర్లతో సంప్రదింపులు జరిపాము, అమిత్ షాపై లీగల్ కేసు ఫైల్ చేయబోతున్నాం" అని ఆమె స్పష్టం చేశారు. హోం మంత్రిగా శాంతిభద్రతలను కాపాడాల్సిన వ్యక్తే ఇలాంటి "వైలెంట్ రిమార్క్స్" చేయడం ఆశ్చర్యకరమని ఆమె వ్యాఖ్యానించారు.

# మహిళా రిజర్వేషన్ బిల్లుపై రాజకీయ ఆరోపణలు...




హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 26, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి::
మేడ్చల్ అర్బన్ జిల్లా షాపూర్‌నగర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ (టి) శాసనసభ్యులు పాల్వాయి హరీష్ బాబు మహిళా రిజర్వేషన్ బిల్లుపై స్పందించారు. కాంగ్రెస్ మరియు దాని మిత్ర పక్షాలు బిల్లును అడ్డుకున్నాయని ఆరోపించారు.డీలిమిటేషన్ అనంతరం చట్టసభల్లో సీట్ల పెంపుతో మహిళా రిజర్వేషన్ అమలు సాధ్యమవుతుందని, 2029 ఎన్నికల నాటికి అమలు లక్ష్యంగా ఉందని పేర్కొన్నారు. జీఎస్‌డీపీ ఆధారంగా సీట్ల కేటాయింపు ప్రతిపాదన గ్రామీణ ప్రాంతాలకు నష్టం కలిగించవచ్చని అభిప్రాయపడ్డారు

# తిర్యాణి ఎస్ఐకు గోపెర గ్రామస్థుల అభినందనలు




హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 26, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:
కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి మండల కేంద్రంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ సుబ్బారావును గోపెర గ్రామ పంచాయతీ సర్పంచ్ పెందోర్ దేవుబాయి, కాశిరాం ఆధ్వర్యంలో గ్రామస్థులు ఆదివారం కలుసుకుని అభినందించారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి విధుల్లో విజయవంతం కావాలని ఆకాంక్షించారు. పోలీసు-ప్రజల మధ్య సమన్వయం, గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలని గ్రామస్థులు కోరగా, ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తానని ఎస్ఐ తెలిపారు. కార్యక్రమంలో స్థానిక రైతులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## బడిబాట కార్యక్రమం..ఆశ్రమ పాఠశాలల్లో చేరికలకు అవగాహన




హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 26, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:
కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలోని కోసిని, పర్ధంగూడ ప్రాంతాల్లో ఆదివారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. గిరిజన గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తూ విద్యార్థుల చేరికలను ప్రోత్సహించారు.పర్ధంగూడ అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించి చిన్నారులను ముందుగా అంగన్వాడిలో నమోదు చేసి, అనంతరం ఆశ్రమ పాఠశాలల్లో చేరేలా సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమ విద్య, ఉచిత వసతి, భోజనం, పాఠ్యపుస్తకాలు వంటి సౌకర్యాలపై వివరించారు.ఈ కార్యక్రమంలో ఏసీఎంఓ పూర్కా ఉద్ధవ్ పాల్గొని విద్య హక్కు ప్రాముఖ్యతను వివరించారు. గ్రామస్తులు, తల్లిదండ్రులు కార్యక్రమానికి సహకరించారు.

## కోమట్ల మఠంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి వేడుకలు



హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 26, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం కొలనుపాక గ్రామంలోని వాసవి కన్యకా పరమేశ్వరి నగరేశ్వర స్వామి కోమట్ల మఠంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి సహిత నగరేశ్వర స్వామికి అభిషేకములు, సామూహిక కుంకుమార్చన, తీర్థ ప్రసాదాలు, అనంతరం అన్నదాన కార్యక్రమం, నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐవిఎఫ్ యాదాద్రి భువనగిరి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రొద్దుటూరు రమేష్ గుప్తా, కాసెట్టి శ్రవణ్ కుమార్, కస్తూరి ఆంజనేయులు, నంగునూరు కృష్ణమూర్తి, దిడిగం అంజయ్య, దిడిగం వీరయ్య, మిరియాల ఉమామహేశ్వర్, వంగపల్లి నరేందర్, కస్తూరి వెంకటేశం, ఆలేరు నాయకులు సముద్రాల శ్రీనివాస్, మిరియాల మహేశ్వర్, నంగునూరు ఆంజనేయులు, గంగిశెట్టి వీరేశం, దిడిగం సంతోష్, దిడిగం సందీప్, గంగిశెట్టి బాలయ్య, మహిళా నాయకులు, కేదారమ్మ, జయమ్మ,ఉపేంద్ర, పద్మ, కవిత, నవనీత, బాలమణి, లక్ష్మి, నవ్య, తదితరులు పాల్గొన్నారు.

## బసంతాపురంలో ఘనంగా బంగారు మైసమ్మ తల్లి పండుగ

**గుడి నిర్మాణ దాత ఎంబిఆర్ ఫౌండేషన్ చైర్మన్ మెండు భాస్కర్ రెడ్డి**



హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 26, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : రాజపేట మండలం బసంతపురం గ్రామంలో రజక కులస్తుల బంగారు మైసమ్మ తల్లి పండుగ ఆదివారం జరిగింది. ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ మెండు రత్నమాల సత్తిరెడ్డి హాజరయ్యారు. గుడి నిర్మాణం కి ఎంబీర్ ఫౌండేషన్ చైర్మన్ మెండు భాస్కర్ రెడ్డి గుడి నిర్మాణం కి అయిన పూర్తి ఖర్చు భరించి గుడి నిర్మాణం చేపట్టారు. ఈ బంగారు మైసమ్మ తల్లి పండుగకి బసంతపురం గ్రామ సర్పంచ్ మెండు రత్నమాల సత్తి రెడ్డి, ఉప సర్పంచ్ గుళ్ళపల్లి రాజు గౌడ్,వార్డ్ మెంబర్లు 1వ వార్డ్ సభ్యులు మాధవి సురేష్, 2వ వార్డ్ సభ్యులు కవిత బాలకృష్ణ, 3వ వార్డ్ సభ్యులు ముల్కలపల్లి రమేష్, 5వ వార్డ్ సభ్యులు మెండు ఉపేందర్ రెడ్డి, 6వ వార్డ్ సభ్యులు రాములమ్మ రామకోటి, ఎంబీర్ ఫౌండేషన్ చైర్మన్ మెండు భాస్కర్ రెడ్డి, రజక కుల పెద్దలు రజక కులస్తులు పాల్గొని బంగారు మైసమ్మ తల్లి ని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించి, సామూహిక భోజనాలలో పాల్గొన్నారు. గుడి నిర్మాణ దాత మెండు భాస్కర్ రెడ్డికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపి సత్కరించారు.

# భారత్ కు చైనా, పాకిస్థాన్ ఒకేసారి వార్నింగ్..! భారత్ కు ముప్పు పొంచి ఉందా..?



హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 26 :
భారత్ కు సరిహద్దు దేశాలైన పాకిస్థాన్, చైనాతో ఎప్పుడూ ముప్పు పొంచి ఉంటుంది. భారత్ కు దెబ్బకొట్టేందుకు పాకిస్థాన్, చైనాలు ఎప్పుడూ ప్లాన్ చేస్తూ ఉంటాయి. గతేడాది పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా పాకిస్థాన్ పై భారత్ చేపట్టిన ఆపరేషన్ సింధూర్ లోనూ ఆ దేశం చైనా కు చెందిన అత్యాధునిక ఆయుధాలను భారత్ పై ప్రయోగించింది. ఇక పాకిస్థాన్- చైనా మధ్య రక్షణ, అంతరిక్ష భాగస్వామ్యం బలంగానే ఉంది. తాజాగా పాకిస్థాన్ కు చెందిన పి.ఆర్.ఎస్.సి - ఇూ3 శాటిలైట్ ను చైనా ప్రయోగించింది. షాంగ్జీ ప్రావిన్స్ లోని తైయువాన్ శాటిలైట్ లాంచ్ సెంటర్ నుంచి ఈ ప్రయోగం విజయవంతంగా జరిగింది. పాకిస్థాన్, చైనా సవాళ్లతో భారత్ అలర్ట్ అయింది.పాకిస్థాన్- చైనా మైత్రి మరోసారి బట్టబయలు అయింది. ఉత్తర చైనాలోని షాంగ్జీ ప్రావిన్స్ లోని తైయువాన్ శాటిలైట్ లాంచ్ సెంటర్ నుంచి పాకిస్థాన్ కు చెందిన పి.ఆర్.ఎస్.సి - ఇూ3 శాటిలైట్ ను చైనా విజయవంతంగా ప్రయోగించింది. ఈ ఉపగ్రహాన్ని లాంగ్ మార్చ్- 6 రాకెట్ ద్వారా కక్ష్యలోకి పంపించారు. అయితే గతేడాది కాలం నుంచి చైనా ప్రయోగించిన పాకిస్థాన్ కు చెందిన నాలుగో శాటిలైట్ ఇది కావడం గమనార్హం. దాంతో ఇరు దేశాల మధ్య అంతరిక్ష బంధం మరింత బలపడినట్లుగా స్పష్టం అవుతోంది. శాటిలైట్ ప్రయోగంతో పాటుగా చైనా స్పేస్ మిషన్ లో పాల్గొనేందుకు ఇద్దరు పాకిస్థానీ వ్యోమగాములు సైతం ట్రైనింగ్ కోసం ఇప్పటికే బీజింగ్ చేరుకున్నట్లు సమాచారం.ఇక ట్రైనింగ్ తర్వాత వీరిలో ఒకరు చైనాకు చెందిన తియాంగాంగ్ స్పేస్ స్టేషన్ కు చేరుకోనున్నారు. దాంతో చైనా అంతరిక్ష కేంద్రంలోకి అడుగు పెట్టిన తొలి విదేశీ వ్యోమగామిగా పాకిస్థాన్ ప్రతినిధి నిలవనున్నట్లు తెలుస్తోంది. ఈ పరిణామాలు చైనా- పాకిస్థాన్ మధ్య ఉన్న వ్యూహాత్మక, సాంకేతిక సహకారానికి మరింత బలాన్ని చేకూరుస్తోంది. తాజాగా జరుగుతున్న పరిణామాలపై భారత్ అలర్ట్ అయింది. చైనా, పాకిస్థాన్ కదలికలను క్షుణ్ణంగా పరిశీలిస్తోంది. ఇక పహల్గామ్ ఉగ్రదాడి నుంచి భారత్- పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తత నెలకొన్న విషయం తెలిసిందే.

## భారత్ కాళ్ల వద్దకు పాకిస్థాన్.. సంచలన నిర్ణయం దిశగా మోదీ సర్కార్..!



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 26 :**
గతేడాది ఏప్రిల్ 22న పహల్గామ్ ఉగ్రదాడి జరిగిన తర్వాత పాకిస్థాన్ పై భారత్ కఠిన చర్యలు తీసుకుంది. అందులో ఇరుదేశాల మధ్య ఎగుమతులు, దిగుమతులు రద్దు, అటారీ- వాఘా బోర్డర్ రద్దు, పాక్ పౌరులకు వీసాల జారీ నిలిపివేతతోపాటు సింధూ నదీ జలాల ఒప్పందాన్ని భారత్ నిలిపివేసింది. అయితే పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా ఇప్పటికే ఆర్థిక సంక్షోభంలో ఉంది పాకిస్థాన్. అక్కడ లాక్ డౌన్ తరహా పరిస్థితులు ఉన్నాయి. దాంతోపాటు ప్రస్తుతం ఎండలు మండిపోతున్న క్రమంలో తమకు తాగునీరు, సాగునీరు కోసం భారత్ తో మరోసారి చర్చలు జరిపేందుకు పాకిస్థాన్ సిద్ధం అవుతున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు భారత్ తో కాళ్లబేరానికి రానున్నట్లు సమాచారం అందుతోంది.సింధూ జలాల ఒప్పందం నిలిపివేతపై పాకిస్థాన్ మరోసారి ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిని ఆశ్రయించినట్లు సమాచారం. సింధూ జలాల ఒప్పందం విషయంలో తమకు భారత్ సహకరించడం లేదని భారత్ నిర్ణయం కారణంగా తమ దేశంలోని నీటి భద్రతకు ముప్పు వాటిల్లుతోందని పాకిస్థాన్ ఆవేదన వ్యక్తం చేసింది. ఈ మేరకు భారత్ పై మరోసారి ఐక్యరాజ్యసమితికి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పాకిస్థాన్ ఉప ప్రధాని, విదేశాంగ మంత్రి ఇషాక్ ధార్ పంపిన అధికారిక లేఖను.. ఆ దేశ ప్రతినిధి ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి అధ్యక్షుడికి అందజేశారు. సింధూ జలాలపై డేట్ షేరింగ్ ను వెంటనే పునరుద్ధరించాలని లేఖలో పేర్కొన్నారు.మరోవైపు ఇదే విషయంపై మాజీ బ్యూరోక్రాట్ కేబీఎస్ సింధు కీలక వ్యాఖ్యలు చేశారు. పాకిస్థాన్ లో నీటి సమస్య కారణంగా ఆ దేశం భారత్ తో చర్చలకు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. అయితే ఈసారి పాకిస్థాన్ చర్చలకు వచ్చినప్పుడు భారత్ తో సమాన భాగస్వామిలా కాకుండా నీటి సంక్షోభంలో ఉన్న దేశంగా వస్తుందని ఆయన పేర్కొన్నారు. ఇక గతేడాది ఏప్రిల్ 22న పహల్గామ్ లో జరిగిన ఉగ్రదాడిలో 26 మంది అమాయక టూరిస్టులు ప్రాణాలు కోల్పోయారు. ఈ దాడికి పాకిస్థాన్ కేంద్రంగా పనిచేసే ఉగ్రవాద సంస్థలతో సంబంధం ఉందని భారత్ గుర్తించింది. ఆ తర్వాత మే 7-10 తేదీల్లో పాకిస్థాన్, పాకిస్థాన్ ఆక్రమిత కాశ్మీర్ లోని 9 కీలక ఉగ్రవాద స్థావరాలపై దాడి చేసి వాటిని ధ్వంసం చేసింది. వందలాది మంది టెర్రరిస్టులను హతమార్చింది.ఇక పాకిస్థాన్ వ్యవసాయ రంగానికి సింధూ, జీలం, చీనాబ్ నదులు జీవనాడి లాంటివి. ఎండాకాలం తీవ్రత పెరుగుతున్న తరుణంలో పాకిస్థాన్ నీటి సమస్యతో కొట్టుమిట్టాడుతోంది. ఈ మేరకు త్వరలోనే చర్చలకు వచ్చేట్లు కనిపిస్తుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అయితే ఈ వివాదాన్ని పాకిస్థాన్.. అంతర్జాతీయ స్థాయిలో తీసుకెళ్లడానికి యత్నిస్తుండగా.. భారత్ మాత్రం ఉగ్రవాదానికి వ్యతిరేకంగా తీసుకున్న నిర్ణయంగా అభివర్ణిస్తోంది.

## బేగంపేట గ్రామ అభివృద్ధికి నిధులు కేటాయించండి పాలకవర్గం

**ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు వినతి**

హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 26, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : రాజపేట మండలం బేగంపేట గ్రామ అభివృద్ధికి కావలసిన నిధులు కేటాయించి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య కు పాలకవర్గం ఆదివారం వినతిపత్రం సమర్పించారు . గ్రామంలో అభివృద్ధి పనులు సాగాలంటే నిధులు చాలా అవసరమని సర్పంచ్ ఇండ్ల అనుష సుమన్ అన్నారు. ప్రజా సంక్షేమ దృష్టిలో పెట్టుకొని ఎమ్మెల్యే తమ గ్రామానికి నిధులు కేటాయించి గ్రామ సమస్యల పరిష్కారానికి సహకరించాలని కోరారు. గ్రామపంచాయతీ భవనం, అంగన్వాడీ కేంద్రం నిర్మించాల్సిన అవసరం ఎంతో ఉందని, అంగన్వాడి కేంద్రంలో సరైన సౌకర్యాలు లేక పిల్లలు చాలా ఇబ్బంది పడుతున్నారని సర్పంచి ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు 70 సంవత్సరాల క్రితం నిర్మించిన గ్రామపంచాయతీ కార్యాలయం ప్రస్తుతం శిథిలావస్థకు చేరుతుందని ఆమె వివరించారు. గ్రామంలోని కొన్ని ప్రాంతాల్లో రోడ్ల పరిస్థితి దయనీయంగా ఉందని సిసి రోడ్లు నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆమె వివరించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారని, ఆదే విధంగా గ్రామంలో మహిళా సంఘాలు, మీటింగ్ ఏర్పాటు చేసుకోవాలన్న బయట నుండి వచ్చే మహిళా అధికారులతో గ్రామ అభివృద్ధి గురించి చర్చించాలన్న చాలా ఇబ్బంది అవుతుందని తమకు ఒక కార్యాలయం కావాలని అందుకు మహిళా భవన్ నిర్మించాలని గ్రామ మహిళలు కోరుతున్నారని సర్పంచ్ ఇండ్ల అనుష సుమన్ వివరించారు. గ్రామంలో ఏది కొత్త కార్యక్రమం ప్రారంభించాలన్న గ్రామాన్ని అభివృద్ధి చేయాలన్న నిధులు చాలా ముఖ్యమని ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య తమ గ్రామ పరిస్థితిని అర్థం చేసుకొని తగినన్ని నిధులు కేటాయించాలని స్థానిక సర్పంచ్ ఇండ్ల అనూష సుమన్, ఉపసర్పంచ్ బద్ద మధుసూదన్ రెడ్డి, పాలకవర్గ సభ్యులు ఎమ్మెల్యేని కలిసి వినతి పత్రం సమర్పించిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్, ఉపసర్పంచ్ లను ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య శాలువాలతో సత్కరించి, గ్రామ అభివృద్ధికి సహకారం అందించనున్నట్లు హామీ ఇచ్చారు.



### పేరుకే మహిళల సర్పంచులు

# అధికారాలు మాత్రం వారి భర్తల పెత్తనం

హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 26, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : గ్రామ పంచాయతీలలో మహిళలకు రాజకీయ అధికారాన్ని కల్పించేందుకు ప్రభుత్వం రిజర్వేషన్లు అమలు చేస్తున్నప్పటికీ, వాస్తవ పరిస్థితులు మాత్రం భిన్నంగా కనిపిస్తున్నాయి. రాజపేట మండలంలో 23 గ్రామపంచాయతీలకు 10 గ్రామ పంచాయతీలలో మహిళా సర్పంచులే ఉన్నారు. పేరుకే మహిళలు సర్పంచులు అయినా, అధికారాలు మాత్రం వారి భర్తల, కుటుంబ సభ్యుల చేతుల్లోనే కేంద్రీకృతమవుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామాల్లో అనేక చోట్ల సర్పంచ్ పదవిని మహిళలు చేపట్టినా, సమావేశాలు నిర్వహించడం, నిర్ణయాలు తీసుకోవడం, నిధుల వినియోగంపై చర్చించడం వంటి కీలక వ్యవహారాల్లో భర్తలు, కుటుంబ సభ్యులు ముందుండి వ్యవహరిస్తున్నారు. ప్రజలతో మాట్లాడేది, అధికారులతో చర్చించేది కూడా భర్తలేనని స్థానికులు చెబుతున్నారు. మహిళా సాధికారత లక్ష్యంగా ప్రభుత్వం తీసుకొచ్చిన రిజర్వేషన్ విధానం అమలు స్థాయిలో వక్రీకృతమవుతోందని సామాజిక కార్యకర్తలు అభిప్రాయపడుతున్నారు. మహిళలు స్వయంగా నిర్ణయాలు తీసుకునే స్థాయికి చేరుకోకుండా, కుటుంబ సభ్యుల ఆధీనంలోనే ఉండిపోవడం వల్ల అసలు ఉద్దేశ్యం నెరవేరడం లేదని వారు అంటున్నారు. ఇదిలా ఉండగా, కొన్ని ప్రాంతాల్లో మాత్రం మహిళా సర్పంచులు ధైర్యంగా ముందుకు వచ్చి స్వతంత్రంగా పాలన నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. మరికొన్నిచోట్ల సర్పంచ్ భర్తలు ఇష్టం వచ్చినట్లుగా ప్రవర్తిస్తూ దౌర్జన్యాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి, ఈ విషయంపై ఎంపిఓ, పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. అలాంటి ఉదాహరణలను పెంచేందుకు అవగాహన కార్యక్రమాలు, శిక్షణలు అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. మహిళలకు ఇచ్చిన హక్కులు నిజంగా వారి చేతుల్లోకి రావాలంటే, సమాజంలో దృక్కోణం మారాలని, మహిళలు స్వయంగా ముందుకు రావాలని అధికారులు సూచిస్తున్నారు.

# వంగపల్లి విజయలక్ష్మి జన్మదిన వేడుకలు



హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 26, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : ఐవిఎఫ్ ధార్మిక పరిషత్ రాష్ట్ర చైర్మన్ వంగపల్లి అంజయ్య స్వామి సతీమణి వంగపల్లి విజయలక్ష్మి 55వ జన్మదిన వేడుకలు యాదగిరిగుట్ట లోని లోటస్ టెంపుల్ లో అమ్మవారి సమక్షంలో జరుపుకున్నారు. ఆదివారం శ్రీ వాసవి అమ్మవారి జయంతి సందర్భంగా మొదటగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జన్మదినం సందర్భంగా ప్రసాద వితరణ కార్యక్రమాన్ని అంజయ్య స్వామి విజయలక్ష్మి దంపతులు నిర్వహించారు. లోటస్ టెంపుల్ అధ్యక్షులు వెంకట నరసయ్య సువర్ణ పుణ్య దంపతులు, ఉపాధ్యక్షులు బెజుగం శివకుమార్ చంద్రకళ పుణ్య దంపతులు, ప్రధాన కార్యదర్శి ఉప్పల రమేష్ స్వప్న దంపతులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట పట్టణానికి చెందిన ఆర్యవైశ్యులు, మహిళలు పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు చెప్పారు

# ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి మాజీ సర్పంచ్ కోల సత్తయ్య గౌడ్



హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 26, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండలం కొరటికల్ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద కోరటికల్ మాజీ సర్పంచ్ కోల సత్తయ్య గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రైతులు పండించిన పంటను కొనుగోలు చేయాలి దాదాపు 80 లారిల వరి ధాన్యం కోరటిల్ ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఉన్నట్లు తెలిపారు అధికారులు పట్టించుకోక లారిలు రాకపోవడంతో రైతులు చాలా ఇబ్బంది పడుతున్నారు రెండు మూడు లారిలు లోడు అయి మిల్లర్ల వద్ద వెయిటింగ్ లో ఉన్నాయి దీనిని వెంటనే స్థానిక ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పట్టించుకొని జిల్లా కలెక్టర్ మరియు సంబంధిత అధికారులకు తెలియజేసి వెంటనే ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. లేని యెడల మండల కేంద్రంలోని రైతులంత ఏకమై ధర్నాలు రాస్తారోకోలు చేసి జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పెండెం పురుషోత్తం, మోత్కూర్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ సోలిపురం లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ మండల కార్యదర్శి సోలిపురం రామ్ రెడ్డి, బీఆరెస్ గ్రామ శాఖ సెక్రెటరీ జనరల్ చుంచు శ్రీనివాస్, వార్డు సభ్యులు చిన్నం యాదగిరి, చుంచు నాగరాజు రైతులు నాగుల అంజయ్య, పన్నాల ఎల్లారెడ్డి, బెజ్జరబోయిన లక్ష్మణ్, చుంచు రాజయ్య, చుంచు నర్సయ్య, చామకూర నర్సయ్య, బస్వ రాములు తదితరులు పాల్గొన్నారు.

# జావేద్ హబీబ్ సెలూన్ ను ప్రారంభించిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య



హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 26, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చేగూరి మల్లేశం హైదరాబాద్ నగరంలోని మల్లాపూర్ ప్రాంతంలో నూతనంగా ఏర్పాటు చేసిన జావేద్ హబీబ్ సెలూన్‌ను ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు, డీసీసీ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు ఐలయ్య హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా బీర్ల ఐలయ్య మాట్లాడుతూ... యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే ఇలాంటి వ్యాపార సంస్థలు స్థాపించటం అభినందనీయమని పేర్కొన్నారు. స్థానికులకు నాణ్యమైన సేవలు అందించడంలో ఈ సెలూన్ కీలక పాత్ర పోషిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మరియు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# జై శ్రీమన్నారాయణ భక్త బృందం సామూహిక పారాయణం



హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 26, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : రాజపేట మండల కేంద్రంలోని శ్రీ రామకృష్ణ సాయి మందిరంలో జై శ్రీమన్నారాయణ భక్త బృందం సామూహిక సహస్ర పారాయణ కార్యక్రమాన్ని సాంప్రదాయంగా నిర్వహించారు. సకల దేవతా నిలయమైన ఆలయంలో ముఖమండపంలో జై శ్రీమన్నారాయణ భక్త బృందం లలిత సహస్ర పారాయణం గోవింద నామాలు విష్ణు సహస్ర పారాయణం హనుమాన్ చాలీసా పారాణం చేశారు. అనంతరం దేవతామూర్తులకు మంగళహారతి అందజేసి తీర్థ ప్రసాద వితరణ చేశారు. చామకూర అరుణ, రేపాక వైష్ణవి, రంగ లక్ష్మి, రేపాక భాగ్యలక్ష్మి, బిర్రు భాగ్యలక్ష్మి, నాళ్ల పద్మ, పెంట రజిత, ఉప్పల స్వప్న, బెజుగం స్వప్న, పుష్పలత తదితరులున్నారు

# ఘనంగా శ్రీ వాసవి అమ్మవారి జయంతి వేడుకలు



హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 26, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : శ్రీ వాసవి అమ్మవారి జయంతి కార్యక్రమం ఆదివారం అత్యంత భక్తి శ్రద్ధలతో సాంప్రదాయంగా ఘనంగా జరిగింది. రాజపేట మండలం రఘునాథపురం, యాదగిరిగుట్ట పట్టణంలోని లోటస్ టెంపుల్ లో ఈ కార్యక్రమం జరిగింది. శ్రీ వాసవి అమ్మవారి ప్రతిష్ట మూర్తికి పంచామృత అభిషేకాలు జరిగాయి. అనంతరం నూతన వస్త్ర అలంకరణ, మంగళ హారతి ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. ఆలయ గౌరవ అధ్యక్షులు పొద్దుటూరి నరసింహారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అధ్యక్షులు బెజగం వెంకట నరసయ్య, సువర్ణ పుణ్య దంపతులు, యాదగిరిగుట్ట పట్టణంలోని ఆర్యవైశ్య మహిళలు పాల్గొన్నారు. విశేష పూజ కార్యక్రమాలు నిర్వహించారు అనంతరం తీర్థ ప్రసాద వితరణ అన్న ప్రసాద కార్యక్రమాలు జరిగాయి. రాష్ట్ర పండుగ గుర్తించినందుకు సంతోషం వ్యక్తం చేశారు.



# బియ్యప్పిండితో వెరైటీగా "ఫిష్ ఫ్రై"

టేస్ట్ కు ఇంటిల్లిపాదీ మెచ్చుకోవాల్సిందే!



నార్మల్ గా సండే వచ్చిందంటే ఎక్కువ మంది చికెన్ , మటన్ తో రకరకాల వంటకాలు ట్రై చేస్తుంటారు. కానీ, అదే తక్కువ ధరకు వస్తూ ఆరోగ్యానికి మేలు చేసే చేపలను అంతగా పట్టించుకోరు. ఒకవేళ తినాలనుకునే వారు మాత్రం ఎక్కువగా చేపలతో ఫ్రై చేసుకుంటుంటారు. ఈ క్రమంలోనే కొన్నిసార్లు ఎంత బాగా చేసినా ఫిష్ ఫ్రై పర్ఫెక్ట్ గా కుదరట్లేదని బాధపడుతుంటారు. అలాంటి వారికోసమే ఒక నయా స్టైల్ అద్భుతమైన రెసిపీని తీసుకొచ్చాం. అదే, నోరూరించే "సుర్మై ఫిష్ ఫ్రై". ఇది రెగ్యులర్ గా చేసుకునే వాటితో పోల్చితే సూపర్ టేస్టీగా ఉండి ఇంటిల్లిపాదీకి చాలా నచ్చేస్తుంది. ముఖ్యంగా పిల్లలైతే ఒకటికి రెండు ముక్కలు ఇష్టంగా తినేస్తారు. మరి, లేట్ చేయకుండా ఈ ఘుమఘుమలాడే నయా స్టైల్ చేపల వేపుడును ఎలా చేసుకోవాలో ఇప్పుడు చూద్దాం.

**కావాల్సిన పదార్థాలు :**

ఒక కిలో – వంజరం చేప ముక్కలు,నాలుగు టేబుల్ స్పూన్లు – బియ్యప్పిండి,రెండు టేబుల్ స్పూన్లు – అల్లంవెల్లుల్లి పేస్ట్,ఎనిమిది స్పూన్లు – కారం,ఒకటిన్నర స్పూన్లు – పసుపు,రుచికి తగినంత – ఉప్పు,మూడు టేబుల్ స్పూన్లు – నిమ్మరసం,రెండు స్పూన్లు – ధనియాలపొడి,ఒకటిన్నర స్పూన్లు – జీలకర్ర పొడి,ఒక స్పూన్ – మిరియాలపొడి,ఒక స్పూన్ – గరంమసాలా,కొద్దిగా – కరివేపాకు,తగినంత – నూనె,కొన్ని – ఉల్లి స్లైసులు(గార్నిష్ కోసం),నిమ్మ చెక్కలు(గార్నిష్ కోసం)

**తయారీ విధానం :**

ఈ రెసిపీ కోసం ముందుగా తాజా వంజరం చేప ముక్కలను తీసుకుని శుభ్రంగా కడగాలి. ఆపై నీళ్లు వడకట్టి, చేప ముక్కలకు రెండు వైపులా చిన్న గాట్లు పెట్టి పక్కన పెట్టుకోవాలి.ఇప్పుడు ఒక వెడల్పాటి గిన్నె తీసుకుని అందులో కారం, పసుపు, రుచికి తగినంత ఉప్పు, అల్లంవెల్లుల్లి పేస్ట్, నిమ్మరసం, మిరియాలపొడి, ధనియాలపొడి, జీలకర్ర పొడి, గరంమసాలా వేసి ఒకసారి అవన్నీ బాగా కలిసేలా మిక్స్ చేసుకోవాలి.అనంతరం ఈ మసాలా మిశ్రమాన్ని గాట్లు పెట్టి పెట్టుకున్న చేప ముక్కలకు రెండు వైపులా సమంగా అప్లై చేసి ఒక అరగంట పాటు పక్కన పెట్టుకోవాలి.అరగంట తర్వాత అంటే చేప ముక్కలను వేయించడానికి ముందుగా వాటిపై బియ్యప్పిండి చల్లి అది అన్నిటికీ మంచిగా అంటుకునేలా మెల్లగా ఎగరేసినట్లు చేయాలి.ఇప్పుడు స్టవ్ మీద పాన్ లో ఫిష్ ఫ్రై కోసం తగినంత నూనె వేసుకుని వేడి చేసుకోవాలి.ఆయిల్ హీట్ అయ్యాక కరివేపాకు వేసి వేయించుకోవాలి. అది వేగిన తర్వాత మ్యారినేట్ చేసి పక్కన పెట్టుకున్న చేపల ముక్కలు వేసి మీడియం ఫ్లేమ్‌లో వేగనివ్వాలి.నాలుగైదు నిమిషాల తర్వాత అంటే అవి వన్ సైడ్ మంచిగా వేగాయనుకున్నాక గరిటెతో మరో వైపునకు ముక్కలను తిరగేసి అటు కూడా గోల్డెన్ కలర్ వచ్చేంత వరకు చక్కగా వేయించి దింపేసుకోవాలి.ఇక చివరగా ఉల్లిస్లైసులు, నిమ్మ చెక్కలతో గార్నిష్ చేసుకుని సర్వ్ చేసుకున్నారంటే చాలు.అంతే, బియ్యప్పిండితో నీచు వాసన లేకుండా ఘుమఘుమలాడే "సుర్మై ఫిష్ ఫ్రై" రెడీ అవుతుంది!.మరి, నచ్చితే మీరు రెగ్యులర్ పద్ధతిలో కాకుండా ఈ సండే ఇలా చేపల వేపుడు చేసి చూడండి. స్పైసీ స్పైసీగా, కమ్మగా ఉండి ఇంటిల్లిపాదీకి చాలా బాగా నచ్చేస్తుంది! ఒకవేళ మీరు ఈ రెసిపీని తక్కువ క్వాంటిటీలో చేసుకోవాలనుకుంటే చేపలతో పాటు ఇతర పదార్థాలను తగ్గించి తీసుకుంటే సరిపోతుంది.



**టిప్స్ :**

ఈ ఫిష్ ఫ్రై కోసం మీ వద్ద బియ్యప్పిండి లేనట్లయితే దాని ప్లేస్‌లో ఉప్మా రవ్వ అయినా వాడుకోవచ్చు.చేప ముక్కలకు గాట్లు పెట్టడం వల్ల మసాలా మంచిగా పడుతుంది. దాంతో టేస్ట్ కూడా చాలా బాగుంటుంది.అలాగే, చేప ముక్కలను హై ఫ్లేమ్ మీద వేయిస్తే లోపల సరిగ్గా ఉడకవని గుర్తుంచుకోవాలి. అందుకే, వీలైనంత వరకు మీడియం ఫ్లేమ్ లోనే చక్కగా వేయించుకోవాలి.



Edited, Published and Owned by Konadoddi Naveen Kumar and Printed at Srinith Publications Falcon Printing Press #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. And Published from #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. Editor's Konadoddi Naveen Kumar, Dr.Tadhkal Rahul Kumar Reg. No.TEL-TEL/2023/12249. Email.HyderabadPulse23@gmail.com, Web:www.HyderabadPulse.com, Cell: +91-94406 53413, +91-9989834020.